



అప్పన్న ఆలయంలో కప్పస్తంభం వద్ద కలెక్టర్ దంపతులు

ప్రజలకు అందుబాటులో ఉంటా

- వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తా
- ఆర్థిక సంస్థలు, ఐటీ కంపెనీల ఏర్పాటుకు చర్యలు
- యువత, మహిళలకు ఉపాధి కోసం శిక్షణ కార్యక్రమాలు
- తాగునీరు, రహదారులు, కాలుష్య నియంత్రణ, పచ్చదనం పెంపుపై దృష్టి
- విశాఖను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక
- ప్రభుత్వ భూముల పరిరక్షణపై దృష్టి
- జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరేంధిర ప్రసాద్



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ కలుస్తానన్నారు. కలెక్టరేట్‌కు వెళితే కలెక్టర్ కలుస్తారు అన్న నమ్మకం ప్రజల్లో కలిగిస్తానన్నారు. అన్నివర్గాల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానన్నారు. జిల్లా నూతన కలెక్టర్‌గా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద నగరమైన విశాఖలో పనిచేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆర్థిక రాజధానికి కావల్సిన హంగుల కల్పనలో భాగంగా ఆర్థిక సంస్థలు, ఐటీ కంపెనీల ఏర్పాటుకు తన వంతు కృషిచేస్తానన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా అన్నిరకాల కంపెనీలు వచ్చేందుకు కృషిచేస్తానన్నారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అందరి సహకారంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తానని వెల్లడించారు. యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా ... మిగతా 4వ పేజీలో

అప్పన్నను దర్శించుకున్న కలెక్టర్

సింహాచలం, జూలై 3: జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సతీసమేతంగా బుధవారం ఉదయం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి పూర్తి అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ చేసిన కలెక్టర్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

సీపీకి సవాళ్లు

నగరంలో క్షీణించిన శాంతిభద్రతలు

- విచ్చలవిడిగా డ్రగ్స్, గంజాయి విక్రయాలు
- కొరవడిన నిఘా... చెలరేగిపోతున్న రౌడీషీటర్లు
- లోపభూయిష్టంగా రాత్రి గస్తీ
- రాత్రివేళ జాతీయ రహదారి, శివారు ప్రాంతాల్లో దోపిడీలు
- నిర్వీర్యమైన స్పెషల్ బ్రాంచి
- పోలీస్ స్టేషన్లలో సివిల్ సెటిల్‌మెంట్‌లు
- మామూళ్ల మత్తులో ట్రాఫిక్ పోలీసులు
- నిషేధ సమయాల్లో భారీ వాహనాలు రాకపోకలు
- వీటన్నింటిపై కొత్తగా బాధ్యతలు స్వీకరించిన శంఖబ్రత బాగ్చీ దృష్టిసారించాలని కోరుకుంటున్న నగరవాసులు



సీపీ శంఖబ్రత బాగ్చీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శంఖబ్రత బాగ్చీ ఎదుట అనేక సవాళ్లు ఉన్నాయి. నగరంలో గంజాయి, డ్రగ్స్ వినియోగం తారస్థాయికి చేరింది. దీనివల్ల దాడులు, దోపిడీలు, హత్యలు, మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయి. ఇక, నగరంలో ఎక్కడ ఏం జరుగుతోందనే దానితోపాటు పోలీస్ స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాల్సిన స్పెషల్ బ్రాంచి విభాగం ఉనికి కోల్పోయింది. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, సిబ్బంది మామూళ్ల మత్తులో జోగుతూ తమ విధులను విస్మరిస్తున్నారు. కొన్ని స్టేషన్లలో సెటిల్‌మెంట్‌లు జరుగుతున్నాయి. వీటన్నింటినీ చక్కదిద్దడం కొత్త సీపీ ముందున్న తక్షణ కర్తవ్యం.



ఏ సమస్య ఉన్నా తనకు తెలియజేయవచ్చునంటూ బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఫోన్ నంబరును ప్రదర్శిస్తున్న సీపీ బాగ్చీ

నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శంఖబ్రత బాగ్చీకి సమర్థుడైన అధికారిగా పేరుంది. ముక్కుసూటిగా పనిచేయడంతోపాటు అధికారులు, సిబ్బందిలో అవినీతిని, విధినిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించరని ఆయన గురించి తెలిసిన పోలీస్ అధికారులు చెబుతున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని తాపత్రయపడతారని పేర్కొంటున్నారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన రెండో రోజే పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వాంబే కాలనీకి వెళ్లి అక్కడ ప్రజలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. దీంతో సీపీ శంఖబ్రత బాగ్చీపై నగరవాసులు భారీ ఆశలు పెట్టుకున్నారు. వాటిని అందుకోవడానికి సీపీకి కిందిస్థాయి అధికారులు, సిబ్బంది నుంచి ఎలాంటి సహకారం అందుతుందనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మొక్కుబడిగా రాత్రి గస్తీ

చోరీల నియంత్రణకు వీలుగా రాత్రి గస్తీ నిర్వహిస్తుంటారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ చోరీలు జరిగే ప్రాంతాలు, చోరీలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించి రాత్రి పెట్రోలింగ్ బీట్‌లను ఏర్పాటుచేస్తారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ సగటున 80 బీట్లు వరకూ నడుస్తాయి. రాత్రి బీట్, పెట్రోలింగ్ చేసేవారంతా రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజామున ఆరు గంటలు వరకూ తమకు కేటాయించిన రూట్లలో గస్తీ నిర్వహించాలి. కానీ వీరిని పర్యవేక్షించేవారు లేకపోవడంతో బీట్ల సంఖ్య 50కి పడిపోయింది. ఆ బీట్‌లకు వెళ్లేవారు కూడా మొక్కుబడిగా రాత్రి పది గంటల నుంచి గంటసేపు తిరిగి తమ ఇళ్లకు లేదా సినిమా థియేటర్లకు వెళ్లిపోతున్నారు. తర్వాత ఉదయాన్నే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బీట్ పుస్తకాలను అప్పగించి వెళ్లిపోతున్నారు. దీనివల్ల చోరీలకు అడ్డుకట్టపడడం లేదని పోలీసులే అభిప్రాయపడుతున్నారు.

ఆందోళనకరంగా గంజాయి, డ్రగ్స్ వినియోగం

నగరంలో గత కొంతకాలంగా గంజాయి, డ్రగ్స్ వినియోగం తారస్థాయికి చేరింది. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి, డ్రగ్స్ దిగుమతి యథేచ్ఛగా జరిగిపోతోంది. యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కి బానిసలుగా మారుతున్నారు. గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. అదేవిధంగా డబ్బుల కోసం చోరీలు, దారిదోపిడీలకు దిగుతున్నారు.

రాత్రిపూట దారిదోపిడీలు

నగరంలో ఆకతాయిలు చీకటిపడిన తర్వాత జాతీయ రహదారిపై నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాలు, నగర శివార్లలో ఒంటరిగా వచ్చే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారు. ఎవరైనా ప్రతిఘటిస్తే దాడికి దిగుతున్నారు. అక్కయ్యపాలెం నుంచి కంచరపాలెం వరకూ జాతీయ రహదారిపైనా, పెందుర్తి, మధురవాడ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. ఈవ్‌టీజింగ్ కూడా పెరిగింది. పోలీసులకు దీనిపై సమాచారం ఇచ్చినా ... మిగతా 4వ పేజీలో

నిర్లక్ష్యం నీడన అల్లూరి జన్మస్థలం

పాండ్రంగిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో పాలకులు విఫలం

ఐదేళ్లయినా పూర్తికాని మ్యూజియం

- తుప్పలతో దర్శనమిస్తున్న అల్లూరి పార్కు
- నేడు మన్యం వీరుడి జయంతి



అసంపూర్తిగా ఉన్న అల్లూరి మ్యూజియం

పద్మనాభం, జూలై 2: అమేయమైన తన పోరాట పటిమతో ఆంగ్లేయులను ముప్పుతిప్పలు పెట్టిన అల్లూరి సీతారామరాజు జన్మ స్థలమైన పాండ్రంగిపై నిర్లక్ష్యం నీడలు అలముకుంటున్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అల్లూరి జన్మస్థలాన్ని అభివృద్ధి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించింది. ఏటా ఆయన జయంతి రోజున హడావిడి చేసి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి చేతులు దులుపుకోవడం తప్ప చేసిందేమీలేదు.

ఇరవై ఏడేళ్ల అతి పిన్న వయస్సులో భరతమాత దాస్య శృంఖలాలను తెంచడానికి అహరహం శ్రమించిన అల్లూరి వంటి మహనీయుల జీవిత విశేషాలను భావితరాలకు అందించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ గ్రామంలోనే జన్మించిన ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 1996లో అల్లూరి శత జయంతి ఉత్సవాలను నిర్వహించి అప్పటి రాష్ట్ర గవర్నర్ కె.కృష్ణకాంత్, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య వంటి మహనీయులను రప్పించారు. ఆ మహనీయుని స్మారకార్థం అల్లూరి సామాజిక వేదిక, అల్లూరి పార్కు, విగ్రహం, అల్లూరి ఆరోగ్య ఉపకేంద్రం, అల్లూరి పశువైద్యశాల వంటి వాటిని నెలకొల్పారు. 2001లో నాటి పర్యాటక శాఖా మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ మంజూరు చేసిన నిధులతో అల్లూరి జనన గృహాన్ని నిర్మించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించారు. అనంతర కాలంలో వచ్చిన ఎమ్మెల్యేలు ఈ గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారు. 2014లో భీమిలి ఎమ్మెల్యేగా ఎన్నికైన గంటా శ్రీనివాసరావు చొరవతో మరికొన్ని అభివృద్ధి పనులను కొంతవరకు చేపట్టారు. అల్లూరి సామాజిక వేదిక ఆధునికీకరణ, అల్లూరి పార్కులో నూతన విగ్రహం ఏర్పాటు, పార్కు అభివృద్ధి వంటి పనులకు అప్పటి ఎంపీ కంభంపాటి హరిబాబు నిధులు కేటాయించారు. అల్లూరి మ్యూజియానికి రూ.2 కోట్లు మంజూరు చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం రావడంతో తాము కొత్తగా నిధులు మంజూరు చేశామని ప్రకటించి 2019 డిసెంబరు 23న రూ.2 కోట్లతో అల్లూరి మ్యూజియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ మ్యూజియం నిర్మాణం ... మిగతా 4వ పేజీలో



తుప్పలు పేరుకుపోయిన అల్లూరి పార్కు

డిపోల్లో ఉన్న ఇసుక సరఫరాకు గ్రీన్‌సిగ్నల్

- ఒకటి, రెండు రోజుల్లో విధివిధానాలు
- ఈనెల ఎనిమిదో తేదీ నుంచి ఉచితంగా సరఫరా
- పొరుగు జిల్లాల నుంచి రవాణా



విశాఖపట్నం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరు శివారు ప్రాంతాలు లంకెలపాలెం, భీమిలి డిపోల్లో అందుబాటులో ఉన్న 1.2 లక్షల టన్నుల ఇసుక సరఫరాకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించి విధివిధానాలపై ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడే అవకాశం ఉందంటున్నారు.

నగర శివారు ప్రాంతాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల కోసం శ్రీకాకుళం, రాజమండ్రి ప్రాంతాల్లోని రీచ్‌ల నుంచి భారీగా ఇసుక రప్పించారు. రీచ్‌ల నుంచి నేరుగా జగనన్న కాలనీలకు కొంత మేర సరఫరా చేయగా, మరికొంత లంకెలపాలెం, భీమిలి డిపోల్లో నిల్వ చేశారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు నిలిపివేసి, తట్టాబుట్టా సర్దుకుని వెళ్లిపోయారు. మరోవైపు ఎన్నికల సమయంలో రీచ్‌లలో తవ్వకాలు నిలిచిపోవడంతో ఇసుక లభ్యత లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణదారులకు ప్రస్తుతానికి ఇబ్బంది లేకుండా నగర శివారుల్లోని రెండు డిపోల్లో ఉన్న ఇసుకను సరఫరా చేయాలని నిర్ణయించారు. అయితే నిర్మాణదారులకు ఏ విధంగా అందించాలనే దానిపై ప్రభుత్వం తగిన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందించాలని తాజాగా నిర్ణయించింది. అయితే ఇసుక రీచ్‌లు ఉన్నచోట ఇబ్బంది లేదుగానీ విశాఖలో పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. రీచ్‌ల నుంచి నగరానికి తీసుకువచ్చి రవాణా చార్జీల మేర వసూలు చేసి నిర్మాణదారులకు అందజేస్తారా?...లేక ఇసుక అవసరమైన వారికి గనుల శాఖ నుంచి పర్మిట్లు జారీ చేసి రీచ్‌లకు వెళ్లి తెచ్చుకొమ్మంటారా?...అన్నది తేలాల్సి ఉంది. అయితే ఈనెల ఎనిమిదో తేదీ నుంచి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని సూచనప్రాయంగా ఆదేశాలు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఇసుక వినియోగించే నగరం విశాఖపట్నం. కానీ జిల్లాలో ఇసుక రీచ్‌లు లేవు. దీంతో ఇటు శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి, అటు తూర్పుగోదావరి జిల్లా గోదావరి నది నుంచి నగరానికి ఇసుక సరఫరా అవుతుంది. ఈ నేపథ్యంలో నగరంలో నిర్మాణదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేయడానికి ప్రత్యేకించి మార్గదర్శకాలు రూపొందించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

అవి నిరర్థక ఆస్తులు

సొమ్ము చేసుకోవడమే లాభం

- స్టీలుప్లాంటు యాజమాన్యం వాదన
- స్టే ఎత్తివేతకు హైకోర్టులో యత్నం
- స్టాక్ యార్డుల భూములు కీలకం
- అమ్మేస్తే టన్నుకు 600 భారం
- ఊరుకోబోమంటున్న కార్మిక వర్గాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం స్థిరాస్తులను అమ్ముకోవడంపైనే ప్రధానంగా దృష్టిసారించింది. నిరర్థక ఆస్తులు కాబట్టే విక్రయిస్తున్నామని, వాటి వల్ల పెద్దగా ఉత్పాదకత ఏమీ లేదని వాదిస్తోంది. ఇదే విషయం హైకోర్టులో వివరించి, ఆస్తుల అమ్మకంపై ఉన్న స్టేను ఎత్తివేయించుకోవాలని చూస్తోంది. ఇప్పటికే విశాఖపట్నం హెచ్‌బీ కాలనీలో ఉద్యోగుల క్వార్టర్లు కూల్చివేసి ఆ స్థలాన్ని వేలం వేసి అమ్ముకుంది. అలాగే పెదగంట్యాడలో ఖాళీ భూముల్ని అమ్మకానికి పెట్టింది. దీనిపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు వీవీ లక్ష్మీనారాయణ హైకోర్టులో కేసు వేయడంతో స్టే విధించింది. ఆ తరువాత కూడా స్టీల్ యాజమాన్యం వెనక్కి తగ్గలేదు. దక్షిణ భారతదేశంలో విశాఖ స్టీల్ అమ్మకానికి కీలకంగా ఉన్న హైదరాబాద్, చెన్నైలలో స్టాక్ యార్డుల భూములను అమ్మకానికి పెట్టి వాటి ద్వారా రూ.450 కోట్లు సమకూర్చుకోవాలని ప్రణాళిక సిద్ధం చేసింది. మెదక్ జిల్లా వెలుమలలో 22 ఎకరాల భూమిలో స్టాక్ యార్డు ఉంది. అక్కడ ఏటా 4.5 లక్షల టన్నుల స్టీల్ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. హ్యాండ్లింగ్ చార్జీల కింద టన్నుకు రూ.34 మాత్రమే వ్యయం అవుతోంది. ఇక చెన్నైలో 13.2 ఎకరాలలో స్టాక్ యార్డు ఉంది. అక్కడ ఏడాదికి మూడు లక్షల టన్నుల స్టీల్ అమ్ముడవుతోంది. అక్కడ హ్యాండ్లింగ్ చార్జీల కింద టన్నుకు రూ.70 ఖర్చు అవుతోంది. ఈ రెండు నగరాల్లో భూమికి మంచి రేటు వస్తుండడంతో వాటిని అమ్మేయాలని ఇటీవల స్టీల్ ప్లాంటు బోర్డు సమావేశంలో నిర్ణయించారు. వీటిని యాజమాన్యం నిరర్థక ఆస్తులని చెబుతోంది. అంతేకాకుండా వీటిని రైతులు సమకూర్చలేదని, స్టీల్‌ప్లాంటు స్వయంగా కొనుగోలు చేసిందని చెబుతోంది. అందుకే వీటిని విక్రయించుకునే హక్కు ఉందని అంటోంది. ఇదే వాదన హైకోర్టులో వినిపించబోతోంది.

టన్నుకు 600 వ్యయం పెరుగుదల

ఈ యార్డులున్న భూములను అమ్మేస్తే ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికి భూమిని అద్దెకు తీసుకోవాలి. హ్యాండ్లింగ్ చార్జీలు నాలుగైదు రెట్లు ఎక్కువ చెల్లించాలి. దీనివల్ల టన్నుకు రూ.600 భారం పడుతుందని ఉద్యోగ, కార్మిక వర్గాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ యార్డుల అమ్మకం వల్ల కన్‌సైన్‌మెంట్ ఏజెంట్లకు ఆర్థికంగా మేలు జరుగుతుందని, ఆ వర్గం ... మిగతా 4వ పేజీలో

నేడు విద్యా సంస్థల బంద్

విశాఖపట్నం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నీట్, యూజీ నెట్ పరీక్ష పేపర్‌ల లీకేజీ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్న డిమాండ్‌తో ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐ ఎస్ఎఫ్), ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (పీడీఎస్‌వో)లు గురువారం విద్యా సంస్థల బంద్‌కు పిలుపు నిచ్చాయి. బంద్‌లో భాగంగా ఉదయం ఎనిమిది గంటలకు కృష్ణా కాలేజీ వద్ద, పది గంటలకు మహిళా డిగ్రీ కళాశాల వద్ద ర్యాలీ నిర్వహించనున్నట్టు విద్యార్థి సంఘ నాయకుడు నాయుడు తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్ష వాయిదా

బంద్ నేపథ్యంలో గురువారం జరగాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షను ఏయూ అధికారులు వాయిదా వేశారు. బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీహెచ్ఎం కోర్సులు చదువు తున్న విద్యార్థులకు రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపు నివ్వడంతో అధికారులు పరీక్షను వాయిదా వేశారు. ఈ మేరకు ఏయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనను విడుదల చేశారు.

జాతీయ స్కూల్ గేమ్స్ టెన్నిస్‌కి హాసిని ఎంపిక


పతకాలతో హాసిని

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 3: సీబీఎస్ఈ రీజనల్ స్పోర్ట్సు టెన్నిస్ టోర్నీలో నగరానికి చెందిన హాసిని ప్రతిభ చూపింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ టోర్నీ బాలికల అండర్-17 విభాగంలో వ్యక్తిగత, టీం ఈవెంట్లలో ప్రాతినిధ్యం వహించిన హాసిని...అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించి రజత పతకాలు సాధించింది. అలాగే, త్వరలో జరగనున్న సీబీఎస్ఈ జాతీయ స్కూల్ గేమ్స్ టెన్నిస్ టోర్నీలో పాల్గొనేందుకు అర్హత సాధించింది.

సాహిత్యంలో 'బలివాడ'ది ప్రత్యేక అధ్యాయం

సీతంపేట, జూలై 3: తెలుగు నవల, కథా సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన అధ్యాయాన్ని బలివాడ కాంతారావు సృష్టించారని రచయిత డాక్టర్ కేజీ వేణు పేర్కొన్నారు. సీతంపేటలోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బలివాడ కాంతారావు జయంతి సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ బలివాడ కాంతారావు తెలుగు వారు గర్వించదగ్గ రచయిత అన్నారు. రచయిత డాక్టర్ కేజీ వేణు మాట్లాడుతూ రచయిత బలివాడ కాంతారావు బాల్యంలోనే స్కూల్ మేగజైన్‌కు సంపాదకులుగా పనిచేశారన్నారు. ఆయన 38 వరకు నవలు, 400ల కథలు, ఐదు నాటికలు, రేడియో నాటికలు రాశారన్నారు. నిజాయితీ, నిష్కల్మషత్వం, జాలి, దయ, కరుణ తదితర అంశాలు ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించేవన్నారు. 1998లో బలివాడ కథల సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డీవీ సూర్యారావు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సూరపనేని విజయకుమార్, సీహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, ఆక్టర్, కేవీఎస్ మూర్తి, పీవీఆర్ కుమారరావు, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు నిర్ణయించాలి

అక్కయ్యపాలెం, జూలై 3: షెడ్యూల్డ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించాలని కోరుతూ అమరావతిలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, కార్మిక శాఖ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబుకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి. వెంకటరెడ్డి వినతి పత్రమిచ్చారు. కనీస వేతనాల చట్టం 1948, సెక్షన్-5 ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి వేతనాలు సవరించాల్సి ఉన్నా, నేటికి 17 ఏళ్లయినా పెంచకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు. పెరిగే ధరలతో వేతనాలు చాలక కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఇప్పటికైనా ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు సవరించాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో ఆర్టీసీ యూనియన్ నాయకులు తులసీరామ్, శ్రావణ్ ఉన్నారు.

పలు రైళ్లు రద్దు...రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 3: పలాస, విజయనగరం మెయిన్ లైనులో భద్రత పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడంతోపాటు, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు

ఈనెల 5న పలాస-విశాఖ (07471), విశాఖ-పలాస (07470), గుణుపూర్-విశాఖ (085 21), విశాఖ-గుణుపూర్ (08522), విశాఖ-భవానీపట్న (08504), విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ (22820) రద్దు చేశారు. అలాగే, ఈనెల 6న భవానీపట్న- విశాఖ (08503), బ్రహ్మపూర్ - విశాఖ (08531), భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ (22819) రద్దు. ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఈనెల 5న భువనేశ్వర్- రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ (20896) రెండున్నర గంటలు, టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) గంటన్నర, సంబల్‌పూర్ - నాందేడ్ నాగావళి ఎక్స్‌ప్రెస్ (20809) రెండు గంటలు, సంత్రాగచ్చి - తంబరం ఎక్స్‌ప్రెస్ (16090) మూడున్నర గంటలు, విశాఖ - విజయనగరం మెము (07468) రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయి. అలాగే, ఈనెల 4న ముంబాయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) మూడున్నర గంటలు ఆలస్యంగా వెళ్లనుంది.



చదువుతోనే ఉన్నత శిఖరాలు

» దక్షిణ నియోజవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, జూలై 3: చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని, అటువంటి విద్యను ఎట్టిపరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయరాదని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని రమాదేవి బోనోజీరావు ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాఠశాలలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టి తీసుకురావాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలో అన్నివసతులు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హెచ్. ప్రభాకరరావు, ఎంఈఓలు బి. పైడాపునాయుడు, బి. పుష్యరాగం, బిపిన్‌కుమార్, వానపల్లి గాయత్రిఫణికుమారి, సారిపల్లి మహేష్, దాము యాదవ్, విజయానందరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మొకర గోపి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

విశాఖ, దువ్వాడ స్టేషన్లలో రైల్వే జీఎం తనిఖీలు


దువ్వాడ స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్, అధికారులు

విశాఖపట్నం, జూలై 3: తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ బుధవారం విశాఖ, దువ్వాడ రైల్వే స్టేషన్లతోపాటు వడ్లపూడిలోని వ్యాగన్ వర్కుషాపులో పర్యటించారు. ముందుగా విశాఖలో ప్రయాణికుల మౌలిక సదుపాయాలకు సంబంధించి వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫామ్‌లపై పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, స్టాల్స్‌లో అమ్మకాలు, ఆహార పదార్థాల నాణ్యత తదితర అంశాలను తనిఖీ చేశారు. అధికారులతో చర్చించారు. అనంతరం జ్ఞానాపురం ప్రవేశ ద్వారం వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి గతి శక్తి అధికారులతో మాట్లాడారు. అలాగే, మార్షలింగ్ యార్డు, కోచింగ్ యార్డులలో పర్యటించి నిర్వహణ పనులను తనిఖీ చేశారు. అనంతరం వడ్లపూడిలోని వ్యాగన్ వర్కుషాపుకు చేరుకుని పరిశీలించారు. వర్కుషాపులో సామర్థ్యం పెంపునకు అవసరమైన సదుపాయాల ఏర్పాటుపై చీఫ్ ప్రాజెక్టు మేనేజర్‌తో చర్చించారు. అక్కడ నుంచి దువ్వాడ స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికుల వెయిటింగ్ హాల్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, తాగునీరు సదుపాయాలను పరిశీలించారు. అనంతరం రైలు వినియోగదారుల సంఘం సభ్యులు వివరించిన పలు సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి: డీఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో చంద్రకళ

డాబాగార్డెన్స్, జూలై 3: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతతో, మరింతగా రుచిరకంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డీఈవో ఎల్. చంద్రకళ, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సూచించారు. 'నాణ్యతలేని మధ్యాహ్నం భోజనం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురించినకథనానికి స్పందించి పాఠశాల సందర్శనకు వచ్చిన సందర్భంగా వారు మధ్యాహ్నం భోజనాల మెనూ పరిశీలించారు. బిరియాని, చెక్కి, ఆలూ కుర్మా రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహారం బాగుందని అయితే మరింత రుచిగా విద్యార్థులకు నచ్చేలా అందజేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఏవీ సత్యనారాయణ, జే.ఎస్.శాస్త్రి వంటలను స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన

జ్ఞానాపురం, జూలై 3: 41వ వార్డులోని బాబుకాలనీ, సెబాస్టెయిన్ కాలనీల్లో జోనల్ కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, వైద్యాధికారి సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో పారిశుధ్యంపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా పాటలు, నృత్యాల ద్వారా ప్లాస్టిక్ సంచులువాడకంతో దుష్ఫలితాలు, దోమలు నియంత్రణ, తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం ద్వారా కాలనీలు పరిశుభ్రంగా ఉంటాయని వివరించారు.

రూ. 39.80 లక్షలతో పార్కులో అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, జూలై 4 ; గ్రేటర్ 51వ వార్డు మాధవధార కళింగనగర్ ఈస్ట్ పార్కులో పలు అభివృద్ధి నిర్మాణాలకు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు బుధవారం భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. పార్కులో రూ.39. 80 లక్షలతో వాకింగ్ ట్రాక్ విస్తరణ, ఓపెన్ జిమ్ ఏర్పాటు, మరమ్మతులు, టాయిలెట్ తదితర సౌకర్యాలను కల్పించనున్నారు. దీనికి కోసం ఉదయం ఆయన పార్కులో కమిటీ ప్రెసిడెంట్ మురళీ, ఇంజనీరింగ్ అధికారులు, టీడీపీ నాయకులతో కలసి పూజా కార్యక్రమాల్లో హాజరయ్యారు. విస్తరించిన మురళీనగర్, మాధవధార ప్రాంతాలకు అనుగుణంగా ఈ పార్కులో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. వ్యాయామ అవసరాలతో పాటు, పిల్లలకు ఆహ్లాదం కోసం రెండెకరాల సువిశాలమైన పార్కులో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి సనపల.వరప్రసాద్, 51వవార్డు అధ్యక్షుడు సనపల.కీర్తి, బీజేపీ నాయకులు, జనసేన వార్డు అధ్యక్షులు, మహిళా నాయకులుకార్యక్రమంలో ఉన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి పలువురు అభినందన

సీతమ్మధార: ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు పలువురు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. సీతమ్మధారలో బీజేపీ కార్యాలయంలో వైద్యులు, పలు పార్టీల నాయకులు, అభిమానులు ఆయనను కలిసి సన్మానించారు.

లాభాలు ఆర్జించే పంటలు వేయాలి


మాట్లాడుతున్న ఏడీ సత్యనారాయణ రెడ్డి

కంచరపాలెం, జూలై 3: తక్కువ ఖర్చుతో సాగు చేసి లాభా లు ఆర్జించే పంటలపై రైతులు దృష్టిసారించాలని హార్టీ కల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.సత్యనారాయణరెడ్డి సూచించారు. రైతులకు కూరగాయలు పెంపకంపై బుధవారం కంచరపాలెం రైతుబజారులో అవగాహన సదస్సును అవగాహన సదస్సును నిర్వహించారు. సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. పందిర కూరగాయల సాగు, వేసవి పంటలు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరించారు. పందిరి కూరగాయల పెంపకంతో స్వల్పకాలంలోనే లాభాలు చేకూరుతాయన్నారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తిచేశారు.ఎస్టేట్ అధికారి సీహెచ్.కృష్ణమూర్తి, మార్కెటింగ్ ఏడీ యాసిన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం కార్డుదారులకు గోధుమ పిండి

విశాఖపట్నం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బియ్యం కార్డుదారులకు గోధుమ పిండి సరఫరాకు అధి కారులు నిర్ణయించారు. ప్రతికార్డుదారుడికి కిలో గోధుమ పిండి రూ.16కు అందించనున్నారు. అయితే, ప్ర తినెలా బియ్యంతోపాటు పంచదార అరకిలో పంపిణీ చేసేవారు. రాష్ట్రంలో పంచదార సరఫరా విషయంలో ప్రధానంగా బరువు తక్కువగా ఉండడంతో సమస్య ఏర్పడింది. బరువు విషయంలో కాంట్రాక్టర్లను పిలిచి వివరణ కోరింది.ఈ నేపథ్యంలో జూలైగాను పంచదార సరఫరా జరిగే అవకాశం లేదని అధికారులు భావిస్తున్నారు.

షేక్ రషీద్ హాఫ్ సెంచరీ.. కోస్టల్ రైడర్స్ విజయం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 3: ఏపీఎల్ సీజన్-3లో భాగంగా బుధవారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో కోస్టల్ రైడర్స్ 8పరుగుల తేడాతో బెజవాడ టైగర్స్‌పై గెలుపొందింది. కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 170 పరుగులు చేసింది. ఓపెనర్ కెప్టెన్ షేక్ రషీద్ అర్ధసెంచరీ (67; 5బౌండరీలు, 3 సిక్సర్లు) సాధించగా, అభిషేక్ రెడ్డి (35; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), ధరణికుమార్ (14), హర్షవర్ధన్ (14) రాణించారు.కార్తీక్ రామన్ నాలుగు బౌండరీలతో 19 పరుగులు చేశాడు. బెజవాడ టైగర్స్ బౌలర్లలో కె.సాయితేజ రెండు వికెట్లు పడగొట్టగా హరిశంకర్‌రెడ్డి, అఖిల్, లలిత్ మోహన్ తలో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెజవాడ టైగర్స్ 9 వికెట్లకు 162 పరుగులు మాత్రమే చేసింది. ధ్రువకుమార్‌రెడ్డి (45;4 బౌండరీలు, 3 సిక్సర్లు), కెప్టెన్ రిక్కీ బుయ్ (34; 3 బౌండరీలు, ఒక సిక్సర్), పైలా అవినాష్ (42; 4 సిక్సర్లు) రాణించగా మిగిలినవారు పెవిలియన్‌కు క్యూ కట్టారు. కోస్టల్ రైడర్స్ బౌలర్లలో స్టీఫెన్ (2/22), వైశ్రమోద్ (2/35), కార్తీక్ రామన్ (2/44), షేక్ అబ్దుల్లా (1/33) రాణించారు. షేక్ రషీద్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

రాయలసీమ కింగ్స్ విజయం

మరో మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో గోదావరి టైటాన్స్ విజయం సాధించింది. తొలి బ్యాటింగ్ చేసిన గోదావరి నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 175 పరుగులు చేసింది. ఓపెనర్లు కెప్టెన్ జ్ఞానేశ్వర్ (20), వంశీ కృష్ణ అర్ధ సెంచరీ (57; 3 ఫోర్లు, 5 సిక్సర్లు) శుభారంభాన్నిచ్చారు. మిడిల్ ఆర్డర్‌లో ఎస్‌డీఎన్‌వీ.ప్రసాద్ (21), టీ.విజయ్(16), కేవీ.శశికాంత్ (36; 1 బౌండరీ, 3 సిక్సర్లు), సందీప్ (12 నాటౌట్) రాణించారు. రాయలసీమ కింగ్స్ బౌలర్లలో గిరినాథరెడ్డి, సత్యనారాయణరాజు చెరో రెండు వికెట్లు పడగొట్టగా మహ్మద్ రఫీ, కమరుద్దీన్ చెరో వికెట్ తీసారు. అనంతరం బ్యాటింగ్ చేసిన రాయలసీమ కింగ్స్ 18.3 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. డీబీ.ప్రశాంత్‌కుమార్ (49; 4 బౌండరీలు, 3 సిక్సర్లు) అర్ధసెంచరీ చేజారగా, రోషన్‌కుమార్ పవన్ అజేయ అర్ధ సెంచరీ , గుత్తా రోహిత్ (39;3 బౌండరీలు, 3 సిక్సర్లు) రాణించి విజయాన్నందించారు. కేవీ.శశికాంత్, తేజ, సమన్వత్ తలో వికెట్ తీశారు.

కలెక్టర్‌కు అధికారులు, రెవెన్యూ ఉద్యోగుల అభినందనలు


నూతన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న జేసీ అశోక్, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, రెవెన్యూ అధికారులు

విశాఖపట్నం, జూలై 3: నూతనంగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్‌ను జేసీ మయూర అశోక్, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రెవెన్యూ ఉద్యోగులుఈసందర్భంగా పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

» జీతాలు, పింఛన్లు జమ

» నాలుగేళ్ల తర్వాత సమయానికి విడుదల

» ఉద్యోగ వర్గాలు, రిటైర్డ్ ఉద్యోగుల్లో సంతోషం

విశాఖపట్నం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సుమారు నాలుగేళ్ల తరువాత ఉద్యోగులకు జీతాలు, రిటైర్డు ఉద్యోగులకు పింఛన్లు సకాలంలో అందాయి. జూన్‌నెలకు సంబంధించి జీతాలు ఈ నెల ఒకటో తేదీ ఉదయం నుంచి ఉద్యోగుల ఖాతాలకు జమ కావడం ప్రారంభమైంది. దాదాపు మెజారిటీ ఉద్యోగులకు రెండో తేదీనే జమకాగా, మిగిలిన వారికి బుధవారం బట్వాడా చేశారు. ఉపాధ్యాయులకు ఈనెల ఒకటోతేదీ రాత్రి నుంచి ఖాతాలకు జీతాలు జమచేశారు. రిటైర్డు ఉద్యోగులకు పింఛన్ల సొమ్ము ఈనెల రెండోతేదీ నాటికే అందించారు. దాదాపు నాలుగున్నరేళ్ల తరువాత ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల ఖాతాలకు ఇంత త్వరగా జీతాలు, పింఛన్లు జమకావడంతో వారిలో సంతోషం వ్యక్తమవుతోంది. జిల్లాలో అన్ని కేటగిరీలు కలిసి 40 వేల మంది ఉద్యోగులు, 18 వేల మంది పింఛన్‌దారులున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలు ఒకటో తేదీకి జీతాలు , పింఛన్లు బట్వాడా జరిగేవి. తర్వాత ప్రతినెలా రోజుల తరబడి నిరీక్షణ తప్పలేదు. జీతాలకోసం ఉద్యోగులు ఆందోళనలు చేయడంతో ప్రభుత్వం నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో ఉద్యోగులు, పింఛన్లదారులు మౌనంగా నాలుగేళ్ల పాటు బాధ భరించారు. జీతాలు, పింఛన్‌లకు ప్రతినెలా వారం, పదిరోజులు ఒక్కొక్క సారి 15 రోజుల వరకు వేచి చూడడం పరిపాటైంది. ఈ స్థితిలో వీరిలో అసంతృప్తి నెలకొని ఇటీవల జరిగిన ఎన్నికలో అధికార వైసీపీకి వ్యతిరేకంగా ఓటేశారు. అలాగే, ఎన్నికల్లో ఒకటోతేదీకి జీతాలు, పింఛన్లు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా ఈ నెల ఒకటోతేదీ నుంచి మూడోతేదీలోగా చెల్లింపులకు చర్యలు తీసుకున్నారు. సాధారణంగా ఉద్యోగులు ఎక్కువమంది బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు జీతాలనుంచే వాయిదాలు చెల్లిస్తుంటారు. నాలుగున్నరేళ్ల నుంచి సకాలంలో జీతాలు రాక వాయిదాల కోసం ఇబ్బంది పడ్డారు. వేలమంది ఉద్యోగులకు బ్యాంకులు సర్‌చార్జీ విధించాయి. ఈ నెలలో మూడోతేదీలోగా జీతం జమకావడంతో ఇంతకాలానికి ఎదురుచూపులు తప్పాయని టీచర్లు, ఉద్యోగులు ఆనందం వ్యక్తంచేశారు. చంద్రబాబునాయుడు మాట నిలుపుకున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు పేర్కొన్నారు. దీనికితోడు పలువురు ఉద్యోగులకు బకాయిలు కూడా జీతాలతోపాటు విడుదలచేశారరన్నారు. గత నాలుగేళ్ల తర్వాత రెండోతేదీనే పింఛన్ జమ కావడం ఆనందంగా సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఆనందరావు అనే నీటిపారుదల శాఖ ఉద్యోగి సంతోషం వ్యక్తంచేశారు.

నామినేటెడ్ పదవి కేటాయించాలని వినతి

జ్ఞానాపురం, జూలై 3: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి గత 30 ఏళ్లుగా చిత్త శుద్ధితో కృషి చేస్తున్న తమకు శాసనమండలి లేదా నామినేటెడ్ చైర్మన్ పదవి కేటాయించాలని ముఖ్యమంత్రిని గ్రేటర్ 33వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి విల్లూరి తిరుమలాదేవి, చక్రవర్తి దంపతులు కోరారు. మంగళగిరిలోని పార్టీకార్యాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో బీజేపీ నేతలు భేటీ

మహరాణిపేట, జూలై 3: కేజీహెచ్ సూపరిం టెం డెంట్ డాక్టర్ శివానంద్‌ను భారతీయ జనతా పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర బుధవారం మర్యాదపూర్వకంగా కలి శారు. కేజీహెచ్‌లో పరిస్థితు లు, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నా రు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం దానే శ్వరరావు, మెడికల్ సెల్ జిల్లా కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ భూతం భాగ్యలక్ష్మి, డి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీపీఐ సమావేశాలు

మాధవధార, జూలై 3; మురళీనగర్‌లో నిర్వహించిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు బుధవారంతో ముగిశాయి. తొలి రోజు సోమవారం పార్టీ అంతర్గత సమావేశాలు, మంగళవారంఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పరిణామాలపై మాట్లాడారు. ఆఖరి రోజు బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కార్యవర్గ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

కంచరపాలెం, జూలై 3 : వివాహిత అదృశ్యంపై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. కంచరపాలెం మెట్టు సమీపంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న కాకర మౌనిక (19) భర్త గోపాలస్వామితో కలిసి ఉంటున్నారు. జూన్ 29తేదీన డ్యూటీకి వెళ్లిన మౌనిక ఇంటికి తిరిగి రాకపోవడంతో గోపాలస్వామి బుధవారం ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

... 3వ పేజీ తరువాయి

పెట్టుబడులు తీసుకువచ్చేలా ప్రయత్నిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా స్థిరపడేలా ఉపాధి కల్పనకు అనువుగా శిక్షణ కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తామన్నారు. పర్యాటకంగా ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు తీసుకువచ్చేందుకు యత్నిస్తానన్నారు. జిల్లాలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా, మంచి కనెక్టవిటీతో కూడిన రోడ్ల నిర్మాణం, కాలుష్య నియంత్రణ, పచ్చదనం పెంపుపై దృష్టిసారిస్తామన్నారు. ప్రపంచంలో ఆదర్శ నగరాల తరహాలో విశాఖను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని కలెక్టర్ అన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సమాన ప్రాధాన్యం ఇస్తానన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. జిల్లాలో ప్రభుత్వ భూముల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు. భూ వివాదాల పరిష్కారంపై కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని లోతుగా అధ్యయనం చేస్తామన్నారు. నిజమైన భూ యజమానులకు న్యాయం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

కలెక్టర్‌కు స్వాగతం

కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ విజయవాడ నుంచి బుధవారం ఉదయం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ చేరు కున్నారు. తొలుత సింహాచలం వెళ్లి నృసింహస్వామిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు డీఆర్‌వో మోహన్‌కుమార్, ఏవో దేవప్రసాద్ స్వాగతం పలికారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరేంధిర ప్రసాద్‌కు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీవోలు హుస్సేన్‌సాగర్, భాస్కర్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు త్రినాథరావుతోపాటు ప్రతినిధులు రాజేంద్రవర్మ, యోగి, రవిశంకర్, సుధీర్, పలుశాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు.

సీపీకి సవాళ్లు

... 3వ పేజీ తరువాయి

సకాలంలో స్పందించడం లేదు.

రౌడీషీటర్లపై లోపించిన నిఘా

నగరంలో రౌడీషీటర్లపై నిఘా లోపించింది. దీంతో కొంతమంది రౌడీషీటర్లు సెటిల్‌మెంట్లు, రియల్ ఎస్టేట్ గొడవల పరిష్కారం, తమ ప్రాంతంలో ఆధిపత్యం కోసం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం చేస్తున్నారు. గతంలో ప్రతి రౌడీషీటర్‌కు ఒక్కో కానిస్టేబుల్‌ను అటాచ్‌మెంట్ చేసేవారు. దీనివల్ల రౌడీషీటర్ ఉదయం నుంచి రాత్రి నిద్రపోయేంత వరకూ ఎక్కడెక్కడ తిరిగాడు, ఎవరెవరితో మాట్లాడాడు...వంటి వాటిపై ఎప్పటికప్పుడు సమాచారం ఉండడంతో నేరాలకు పాల్పడేందుకు అవకాశం ఉండేది కాదు. అలాగే యాక్టివ్‌గా ఉండేవారిని నగరం నుంచి బహిష్కరించేవారు. గత కొంతకాలంగా నిఘా లోపించడంతో కొంతమంది రౌడీలు రెచ్చిపోతున్నారు.

మామూళ్ల మత్తులో పోలీసులు

నగర పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పనిచేసే కొంతమంది అధికారులు, సిబ్బంది మామూళ్ల మత్తులో జోగుతున్నారు. నగరంలోకి భారీ వాహనాల ప్రవేశంపై రద్దీ వేళల్లో నిషేధం ఉంది. అదేవిధంగా జనావాసాల్లో గోడౌన్లు ఏర్పాటుచేయడం కూడా నిబంధనలకు విరుద్ధం. కానీ కొన్ని ట్రాన్స్‌పోర్టు కంపెనీలు, సిమెంట్, ఐరన్, హార్డ్‌వేర్ వ్యాపారాలు చేసేవారంతా ట్రాఫిక్ పోలీసులను మామూళ్లతో మచ్చిక చేసుకుంటున్నారు. సమయంతో సంబంధం లేకుండా భారీవాహనాలు నగరంలోకి ప్రవేశించడానికి అవకాశం ఇస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ జామ్‌లు, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మద్దిలపాలెంలో ఐరన్, సిమెంట్ దుకాణాల వద్ద భారీ వాహనాలకు జాతీయ రహదారిపైనే ఉంచి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. దీనివల్ల అక్కడ ట్రాఫిక్ జామ్ అవుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోరు. రోడ్లపక్కన వ్యాపారాలు చేసుకునే తోపుడుబండ్ల నుంచి కూడా పోలీసులు రోజుకు రూ.50 నుంచి రూ.200 వరకూ వసూలు చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

స్టేషన్లలో సివిల్ సెటిల్‌మెంట్‌లు

నగర పరిధిలోని కొన్ని పోలీస్ స్టేషన్లలో సివిల్ సెటిల్‌మెంట్లు భారీగా జరుగుతున్నాయి. సివిల్ కేసుల జోలికి వెళ్లకూడదనే నిబంధన ఉన్నప్పటికీ భారీగా డబ్బులు వస్తాయనే ఆశతో పోలీసులు ఆయా కేసులపై ప్రత్యేక శ్రద్ధకనబరిచి, మిగిలిన కేసులను పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. వీటన్నింటిపైనా సీపీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నిర్లక్ష్యం నీడన అల్లూరి జన్మస్థలం

... 3వ పేజీ తరువాయి

నేటికీ పూర్తికాలేదు. కోనేరు వద్ద ఏర్పాటుచేసిన పార్కు నిర్వహణ లేక తుప్పలు, డొంకలు పెరిగి అధ్వానంగా ఉంది. అల్లూరి సామాజిక వేదిక కూడా వాహనాలు నిలుపుకునే స్థలంగా మారిపోయింది. ఈ గ్రామాన్ని ఒక స్ఫూర్తి కేంద్రంగా నిలిపి అల్లూరి జన్మ స్థలాన్ని పర్యాటకులు సందర్శించే విధంగా తీర్చిదిద్దడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. పర్యాటక శాఖ అధికారులు కూడా కేవలం జయంతి రోజు వచ్చి హడావుడి చేసి ఉత్సవం ముగిసిన తరువాత చేతులు దులుపుకొని వెళ్లిపోవడం ఏటా సాధారణమైపోయింది. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అల్లూరి అల్లూరి జయంతిని రాష్ట్రపండగలా జరపాలని 2014లోనే జీవో జారీచేశారు. గతంలో పర్యాటక శాఖా మంత్రిగా పని చేసిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు నగర సందర్శనకు వచ్చే పర్యాటకులు పద్మనాభం మండలం అల్లూరి జన్మస్థలం, పద్మనాభ యుద్ధ స్థలం, పొట్నూరులో శ్రీకృష్ణదేవరాయల విజయస్థూపం వంటి చారిత్రక స్థలాలతో పాటు, ఆలయాలను కూడా సందర్శించే విధంగా ప్రత్యేక పర్యాటక ప్యాకేజీ రూపొందిస్తామని ప్రకటించారు. ఆ హామీ ప్రకటనలకే పరిమితమయ్యింది. ఇదిలావుండగా గురువారం అల్లూరి జయంతి వేడుకలు చేయడానికి సన్నాహాలు చేస్తున్న తరుణంలో ఆయన జనన గృహం మరమ్మతు పనులు బుధవారం నాటికి కూడా పూర్తికాలేదు. ఏదో మొక్కుబడిగా జయంతి ముందురోజు హడావిడి చేయకుండా నెలరోజులు ముందుగానే కార్యాచరణ రూపొందించి పనులు చేపడితే ఉత్సవాలకు సార్థకత ఉంటుంది. ఇకనైనా ఈ ప్రాంతానికి పర్యాటకంగా ప్రాచుర్యం కల్పించి అల్లూరి జనన స్థలాన్ని భావితరాలు సందర్శించే విధంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

అవి నిరర్థక ఆస్తులు

... 3వ పేజీ తరువాయి

లాబీయింగ్ చేస్తూ యాజమాన్యంతో భూములు అమ్మించేందుకు యత్నిస్తోందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కమీషన్లు భారీగా వస్తాయనుకుంటే...ఎటువంటి అమ్మకాలు, కొనుగోళ్లకైనా తల ఊపే ఉన్నతాధికారులు ఉండడం వల్ల కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవ నిరర్థక ఆస్తులైన హెచ్‌బీ కాలనీ, పెద గంట్యాడ కాలనీల భూముల అమ్మకంపై తమకు అభ్యంతరం లేదని, స్టాక్‌యార్డుల భూముల విక్రయాన్ని అంగీకరించబోమని స్పష్టం చేస్తున్నారు. హైకోర్టులో స్టే తొలగించడానికి యాజమాన్యం ప్రయత్నిస్తే నాయకులు ఏమని వాదిస్తారో చూస్తామని, వారు సరైన రీతిలో స్పందించకపోతే తాము ఇంప్లీడ్ అవుతామని కార్మిక వర్గాలు చెబుతున్నాయి.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **VETHSA VENKATESH** (Old Name) S/o. Late. Vetcha Venkata Jagannadham, resident of D.No. 2-2-2/3, Sector-9, MVP Colony, Visakhapatnam-17. Change my name from **VETHSA VENKATESH** (Old Name) to **VETCHA VENKATESH** (New Name) henceforth I am being called as **VETCHA VENKATESH** (New Name) S/o. Late. Vetcha Venkata Jagannadham, for all purposes.
AJV_ 192979

CHANGE OF NAME

★ I, **JOSYULA SRUJANA** (Old Name) W/o. Ramamuni Ramesh Babu, resident of D.No.55-7-30, Sanjay Gandhi colony, HB Colony, Visakhapatnam. Change my name from **JOSYULA SRUJANA** (Old Name) to **RAMAMUNI SRUJANA** (New Name) henceforth I am being called as **RAMAMUNI SRUJANA** (New Name) W/o. Ramamuni Ramesh Babu, for all purposes.
AJV_ 1201

CHANGE OF NAME

★ I, **PAPPU SANTHI** (Old Name) W/o. Pappu Laxmana Rao, resident of D.No.71-31-107/1, Gudivada Appanna Colony, Malkapuram, Visakhapatnam. Change my name from **PAPPU SANTHI** (Old Name) to **PAPPU PARVATAMMA** (New Name) henceforth I am being called as **PAPPU PARVATAMMA** (New Name) W/o. Pappu Laxmana Rao, for all purposes.
AJV_192983

CHANGE OF NAME

★ I, **ZAINUL ABEDIN** (Old Name) S/o. Mohammed Sarfaraz Khatha, resident of 3-13-6, Rehmat House, Arakala Gedda Veedhi, Vizianagaram. Change my name from **ZAINUL ABEDIN** (Old Name) to **ZAINUL ABEDIN KHATHA** (New Name) henceforth I am being called as **ZAINUL ABEDIN KHATHA** (New Name) S/o. Mohammed Sarfaraz Khatha, for all purposes.
AJV_ 192980

CHANGE OF NAME

★ I, **EERLI SURESH** (Old Name) S/o. Earli Pathri Naidu, resident of Jaithavaram, Cheedikaada, Visakhapatnam. Change my name from **EERLI SURESH** (Old Name) to **EARLI SURESH** (New Name) henceforth I am being called as **EARLI SURESH** (New Name) S/o. Earli Pathri Naidu, for all purposes.
AJV_192982

CHANGE OF NAME

★ I, **SEEPNA SRINIVASARAO** (Old Name) S/o. Seepana Adinarayana, resident of 11-14/15, Carpenters colony, Madhurawada, Visakhapatnam. Change my name from **SEEPNA SRINIVASARAO** (Old Name) to **SEEPANA SRINIVASA RAO** (New Name) henceforth I am being called as **SEEPANA SRINIVASA RAO** (New Name) S/o. Seepana Adinarayana, for all purposes.
AJV_192981

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి


ఇందిరానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల


గోపాలపట్నం-1 ప్రాథమిక పాఠశాల



కొత్తపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

ప్రాథమిక పాఠశాలల్లో తగ్గిన ప్రవేశాలు

- ఐదు నుంచి ఆరో తరగతికి వెళ్లిన వారిలో సగం కూడా చేరని విద్యార్థులు
- పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

గోపాలపట్నం, జూలై 3: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై ఇరవై రోజులు దాటినా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఆశించిన స్థాయిలో విద్యార్థుల ప్రవేశాలు జరగడం లేదు. గత ఏడాది ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి విద్యాభ్యాసం పూర్తి చేసి వెళ్లిన విద్యార్థుల కంటే ఈసారి కొత్తగా చేరిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. గోపాలపట్నం పరిసరాల్లోని 89, 91, 92 వార్డుల్లో కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, గోపాలపట్నం, వెంకటాపురం, పద్మనాభనగర్, కంపరపాలెంలలో పది ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. దాదాపుగా అన్ని పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థుల చేరిక తక్కువగానే ఉంది. కొత్తపాలెంలో ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది 184 మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది 151 మందికి పరిమితమయ్యారు. పాఠశాల నుంచి 62 మంది విద్యార్థులు వెళ్లగా కొత్తగా 32 మంది మాత్రమే చేరారు. గోపాలపట్నం-1 పాఠశాలలో గత ఏడాది 112 మంది విద్యార్థులుండగా, ఈ ఏడాది 85 మంది మాత్రమే ఉన్నారు. పాఠశాల నుంచి 40 మంది విద్యార్థులు వెళ్లగా కొత్తగా 15 మంది మాత్రమే చేరారు.

అలాగే ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది 120 మంది విద్యార్థులుండగా, ఈసారి 89 మంది మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాల నుంచి ఐదో తరగతి విద్యార్థులు 50 మంది వెళ్లగా కొత్తగా 15 మంది మాత్రమే చేరారు. పద్మనాభనగర్ పాఠశాలలో గత ఏడాది 99 మందికి, ఈ ఏడాది 81 మందే ఉన్నారు. పాఠశాల నుంచి 25 మంది విద్యార్థులు వెళ్లగా కొత్తగా ఎనిమిది మంది మాత్రమే చేరారు. ఎల్లపువానిపాలెం ఎంపీపీ పాఠశాలలో గత ఏడాది 154 మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది 132 మంది మాత్రమే ఉన్నారు. పాఠశాల నుంచి 60 మంది విద్యార్థులు వెళ్లగా కొత్తగా 32 మంది మాత్రమే చేరారు. ఎస్సీ, బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది 67 మందికి, ఈ ఏడాది 53 మంది మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాల నుంచి 17 మంది ఐదో తరగతి విద్యార్థులు వెళ్లగా.. కొత్తగా తొమ్మిది మంది మాత్రమే చేరారు. ఇక వెంకటాపురం పాఠశాలలో గత ఏడాది 148 మంది విద్యార్థులుండగా, ఈ ఏడాది 121 మంది ఉన్నారు. ఈ స్కూల్ నుంచి 48 మంది విద్యార్థులు వెళ్లగా, కొత్తగా 20 మంది మాత్రమే చేరారు. కంపరపాలెం ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది ఐదో తరగతి విద్యార్థులు 58 మంది ఉండగా, ప్రస్తుతం 40 మందే ఉన్నారు. ఈ పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు వెళ్లగా, కొత్తగా ఎనిమిది మంది మాత్రమే చేరారు.

అదేవిధంగా లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది 90 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పుడు 91 మంది ఉండడం గమనార్హం. ఈ స్కూల్ నుంచి 29 మంది విద్యార్థులు వెళ్లగా, కొత్తగా 27 మంది చేరారు. ఈపాఠశాలలో మాత్రమే చేరికలు ఎక్కువగా ఉన్నాయి.

ప్రైవేటు స్కూళ్ల వైపు తల్లిదండ్రుల చూపు..

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గుముఖం పట్టడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్ల వైపు ఆసక్తి చూపడమే కారణంగా తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ఉన్నా, ప్రైవేట్ పాఠశాలల్లోని బోధన, విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపడం వంటి కారణాలతో తల్లిదండ్రులు వాటి పట్ల ఆకర్షితులవుతున్నారు. ప్రభుత్వ పథకాల నుంచి వచ్చే సొమ్ముకు మరికొంత నగదు జోడించి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.


అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

బొడ్డునాయుడుపాలెంలో కలప స్వాధీనం

పెందుర్తి, జూలై 3: అక్రమంగా దాచిన కలపను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని ముదపాక పంచాయతీ పరిధి బొడ్డునాయుడుపాలెంలోని ఓ టింబర్ డిపో సమీపంలో స్టాక్ యార్డ్‌పై ఫారెస్ట్ రేంజ్ అధికారి (ఎఫ్ఆర్‌వో) రామ్ నరేశ్ బిర్లాంగి ఆదేశాల మేరకు రేంజ్ పరిధి ఫారెస్ట్ స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఖాళీ ప్రదేశంలో గుట్టుగా భద్రపరిచిన టేకు, ఆకేశా దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కలప విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని అటవీశాఖ సిబ్బంది తెలిపారు. జరిమానా విధించనున్నట్టు చెప్పారు.

6 నుంచి రథయాత్ర ఉత్సవాలు

పెందుర్తిరూరల్, జూలై 3: గ్రేటర్ 95వ వార్డు లక్ష్మీపురం సమీపం చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలోని శ్రీ గోపాలకృష్ణ దేవాలయంలో ఈనెల 6 నుంచి 17వ తేదీ వరకు 12 రోజుల పాటు శ్రీ జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా సుభద్ర, బలబద్ర సమేత జగన్నాథ స్వామి వివిధ అవతారాలలో భక్తులకు దర్శనమిస్తారు. చివరి రోజు కళన్యాస హోమం, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి. అన్నసమారాధన ఉంటుంది.

ఆరోగ్యంపై చిన్నారులకు అవగాహన

కూర్మన్నపాలెం, జూలై 3: జీవీఎంసీ 87వ వార్డు పరిధి దుగ్గపువానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బుధవారం పోషణ, ఆరోగ్యంపై కళాజాత సభ్యులు పాటల రూపంలో అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే విధానాలు, భేటీ బచావో-భేటీ పడావో, లింగ భేదం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్రవంతి, వరలక్ష్మి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, శారద, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 22, పచ్చిమిర్చి 80, కాకరకాయలు 48, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 34, క్యారెట్ 36, దొండకాయలు 20, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది)6, అల్లం (పాతది) 145, మునక్కాడలు (కిలో) 86, బరబాటి 54, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 200, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 32, కీరదోస 30, కాప్సికమ్ 74, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 40, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..

బృహత్తర ప్రణాళికతో గాజువాక అభివృద్ధి

- ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి
- సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలి
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూలై 3: గాజువాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన బృహత్తర ప్రణాళికను సిద్ధం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశించారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్, తాగునీరు, పార్కులు, డ్రైనేజీ వ్యవస్థ, క్రీడా మైదానాలు, రహదారులకు మరమ్మతులు, తదితర అంశాలపై సమీక్ష చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా వారికి సేవలందించాలని సూచించారు. గాజువాక నియోజకవర్గంలో వివిధ శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావు ఆదేశించారు. అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. అధికారులందరూ సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు

క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలి: ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూలై 3: జీవీఎంసీ 89, 92 వార్డుల్లో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, కమిషనర్ సాయికాంత్‌వర్మ, బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానాన్ని, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. క్రీడా మైదానం అభివృద్ధితో వేలాది మందికి కలిగే ప్రయోజనాలను కమిషనర్‌కు గణబాబు వివరించారు. క్రీడా మైదానంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలని కోరారు. 89వ వార్డులో ఉన్న వివిధ చెరువులు పూడికలతో నిండి దుర్భరంగా మారాయని, దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నట్టు కమిషనర్‌కు గణబాబు తెలియజేశారు. అందువల్ల ఆయా చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. వీటితో పాటు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. వాటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి అధికారులతో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి ఇ.సురేశ్, వైద్యాధికారి నరేశ్‌కుమార్, జెడ్సీ హేమవతి, పలువురు అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కమిషనర్ సాయికాంత్ వర్మకు సమస్యలను వివరిస్తున్న గణబాబు

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

మల్కాపురం, జూలై 3: ప్రజలతో మమేకమై సేవలందించిన ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, ఏడు వార్డుల మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. 40వ వార్డులో జీవీ ఎంసీ ఏఎన్ఎంగా పనిచేసి పదవీ విరమణ చేసిన విజయకుమారిని బుధవారం ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విజయ కుమారి వృత్తిలో ఎంతో బాధ్యతగా వ్యవహరించారన్నారు. ఆమె శేష జీవితం ఎంతో బాగుండాలని అన్నారు. ఏఎన్ఎం విజయతోపాటు కాగా కార్పొరేటర్, మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్‌ను సిబ్బంది ఈసందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పునఃప్రారంభానికి చర్యలు

గోపాలపట్నం, జూలై 3: గత వైసీపీ పాలనలో మూతపడిన అన్న క్యాంటీన్లను టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటిని ప్రారంభానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు గోపాలపట్నం ప్రధాన రహదారిలోని రైతుబజారు వద్దనున్న అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ నాయకులు బుధవారం పూజా కార్యక్రమం చేపట్టారు కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, 89, 92 వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తికి నివాళి

పెదగంట్యాడ, జూలై 3: మాజీ ఎంపీ డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి జయంతిని ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ములకలపల్లి పెంటయ్య, కాకినాడ అప్పలరాజు, మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, జూలై 3: పద్మనాభపురంలో కొత్త లైన్ల ఏర్పాటుతో పాటు నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలివేయనున్నట్టు ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా బంటాకాలనీ, మేహాద్రిగెడ్డ కాలనీ, అప్పలనరసయ్యకాలనీ, వెంకటసాయినగర్, రవినగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గోపాలపట్నం: ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. అందువల్ల సుసర్లకాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, సీతారామరాజునగర్, బాజీ జంక్షన్, రెడ్డివీధి, ఎస్సీకాలనీ, విద్యానగర్, నాయుడు క్వార్టర్స్, రైల్వే స్టేషన్ రోడ్డు, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

'కార్మిక సంక్షేమం కోసం రాజీలేని పోరాటం'

ఉక్కుటౌన్‌షిప్, జూలై 3: కార్మికుల సంక్షేమం కోసం రాజీ లేని పోరాటాలు చేస్తామని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ఇక్కడి యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కార్మికులకు నేడు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులంతా వేతన సవరణ కోసం ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని, అప్పుడే ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందని పేర్కొన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సమావేశంలో నాయకులు డి.మోహన్, వై.శ్రీనివాస్, వైవీ సుబ్బారావు, జీవీ సుబ్బయ్య, గురుమూర్తి, వేణుబాబు, సత్యనారాయణ, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

సింహాచలం, జూలై 3 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బుధవారం ఉదయం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయం ఈఓ శ్రీనివాసమూర్తి ఆహ్వానం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం తరువాత అంతరాలయంలో అర్చకులు పల్లా శ్రీనివాసరావు గోత్రనామాలతో స్వామివారికి ప్రత్యేక అర్చన చేశారు. గోదాదేవి దర్శించుకున్న తరువాత పండితులు ఆయనకు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

గ్రీన్ ట్యాక్స్ తగ్గించేందుకు కృషి

కూర్మన్నపాలెం: భారీ వాహనాలకు కంటకంగా మారిన గ్రీన్ ట్యాక్స్ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి దానిని తగ్గించేందుకు కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెంలో బుధవారం విశాఖపట్నం బల్క్ బిటూ మేన్ అండ్ ఎల్ఎస్‌హెచ్ఎస్ ట్యాంక్ ట్రక్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అగనంపూడి టోల్‌గేటును ఎత్తివేశామన్నారు. గాజువాకలో ట్రక్ టెర్మినల్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పల్లా శ్రీనివాసరావును అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, నాయకులు పుచ్చా విజయ్‌కుమార్, ఎం.కనకరాజు, అసోసియేషన్ ప్రతినిధులు ఆర్.కృష్ణమూర్తి, తులసీదాస్, రాజేశ్ లాల్, సత్యనారాయణ, అహ్మద్, దేవన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.




కప్పస్తంభం వద్ద పల్లా, ట్యాంక్ ట్రక్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న పల్లా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

భేటీ బచావో-భేటీ పడావో పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, జూలై 3: కర్నవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో భేటీ బచావో-భేటి పడావో పోస్టరును బుధవారం బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి 2015లో ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందుతుందన్నారు. ఆడపిల్ల పుడితే రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందుతుందని పేర్కొన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భెల్ హెచ్‌పీవీపీ నూతన ఏజీఎంకు వినతి

అక్కిరెడ్డిపాలెం, జూలై 3: భెల్ హెచ్‌పీవీపీ నూతన ఏజీఎం (హెచ్ఆర్)గా బుధవారం బాధ్యతలు చేపట్టిన ఎస్.లీలాకు గుర్తింపు యూనియన్ నాయకులతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు అభినందనలు తెలిపి కర్మాగారంలో నెలకొన్న సమస్యలను వివరించారు. హైదరాబాద్ భెల్ యూనిట్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన లీలాకు గుర్తింపు యూనియన్ నాయకులు ఎస్.సాహు, కొల్లి దేముడు, పీవీఎన్ రాజు, ఎ.వెంకటరావు, జి.ప్రసాద్‌తో పాటు పరిరక్షణ ఫ్రంట్ నాయకులు జీటీపీ ప్రకాశ్, ఎస్.జగన్నాథరావు, కె.విజయ్‌కుమార్, కె.నారపరెడ్డి తదితరులు పలు సమస్యలను విన్నవించారు.

రాంపురంలో రాయితీపై విత్తనాలు పంపిణీ

పెందుర్తి, జూలై 3: మండలంలోని రాంపురంలో ఆర్బీకే కేంద్రం వద్ద బుధవారం రైతులకు రాయతీపై ఖరీఫ్ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ టీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కుచ్చు కన్నయ్య అన్నంరెడ్డి శ్రీను. అన్నంరెడ్డి బంగారునాయుడు పాల్గొన్నారు.

నేడు 86వ వార్డులో నీటి సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం, జూలై 3: జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలో దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరా పంపింగ్ మెయిన్ లైన్‌ను మార్చుతున్న కారణంగా గురువారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

డాల్ఫిన్ హిల్స్ ప్రాంగణంలో నాగుపాము హల్‌చల్

సింధియా, జూలై 3: నేవల్ ఏరియా డాల్ఫిన్ హిల్స్ ప్రాంగణంలో బుధవారం సుమారు తొమ్మిది అడుగుల నాగుపాము హల్‌చల్ చేసింది. నేవీ క్వార్టర్స్‌కు చెందిన పలువురు చిన్నారులు ఆడుకుంటున్న సమయంలో తొమ్మిది అడుగుల నాగుపాము కనిపించడంతో వారు భయాందోళనతో పరుగులు తీశారు. ఈ విషయం తెలుసుకున్న నేవీ సిబ్బంది స్నేక్ క్యాచర్ నాగరాజుకు సమాచారం అందించారు. ఆయన వెంటనే అక్కడకు చేరుకుని ఎంతో చాకచక్యంగా నాగుపామును పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం యారాడ అటవీ ప్రాంతంలో పామును విడిచిపెట్టారు.

వినాయక ఆలయంలో మొక్కు చెల్లించిన 'పల్లా'

శ్రీనగర్, జూలై 3: స్థానిక అఫీషియల్ కాలనీ సంపత్ వినాయక ఆలయంలో బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు పల్లాకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పల్లా మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు పార్టీ అనీ, ఎంతో విశ్వాసంతో తనను నమ్మి ఓట్లు వేసిన గాజువాక ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు, వార్డు టీడీపీ ఇన్‌చార్జి అక్కిన లక్ష్మణరావు ఆధ్వర్యంలో పల్లా శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ నాయకులు పుచ్చా విజయ కుమార్, కరణం కనకారావు వార్డు నాయకులు విజయ సాయి, మాదవరావు, నారాయణ ప్రసాద్,శ్రీనివాస్, ఆంజనేయులు,తమ్మిన విజయ కుమార్, బాలు నాయుడు,శంకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'పల్లా' దృష్టికి వెంకటేశ్వర కాలనీ సమస్యలు

అక్కిరెడ్డిపాలెం: గ్రేటర్ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు విజ్ఞప్తి చేశారు. బుధవారం పల్లాను కలిసి అభినందనలు తెలియజేశాక కాలనీలో కమ్యూనిటీ హాల్, రహదారులు, కాలువల సమస్యలను వివరించినట్టు నాయకులు ఎ.వీర్రాజు, పి.పార్వతీశం, ఎ.రాజు, నాయుడులు తెలిపారు.

'జనన, మరణ నమోదు సిబ్బందిపై చర్యలు చేపట్టాలి'

అగనంపూడి, జూలై 3: జనన, మరణ నమోదు కార్యాలయ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కసిపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇక్కడి జనన, మరణ నమోదు కార్యాలయం వద్ద స్థానికులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడి కార్యాలయం సరిగ్గా తెరుచుకోవడం లేదన్నారు. దీంతో ఇక్కడకు వచ్చేవారంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఫోన్‌లో కార్యాలయ సిబ్బందిని సంప్రదించినా సరైన సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 79, 85, 86 వార్డులకు చెందిన ప్రజలంతా జనన, మరణ నమోదు ఇక్కడే చేసుకుంటారని, కార్యాలయాన్ని సరిగ్గా తెరవకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి ఇక్కడి కార్యాలయంలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

గజ వాహనంపై ఊరేగిన వేంకటేశ్వరస్వామి

కూర్మన్నపాలెం,జూలై 3: జీవీఎంసీ 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు వాసుస్వామి, శ్రీధర్ స్వామి, తదితరులు శ్రీవారిని వేణుగోపాలస్వామిగా శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో శ్రీమహాలక్ష్మీ హోమం జరిపారు. సాయంత్రం గజవాహనంపై శ్రీవారిని ఆశీనులను చేసి కోలాటాలు, మహిళల అన్నమాచార్యుల గీతాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావుతో పాటు పద్మజ, రాజ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం, వెంకటరావు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

94వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం

వేపగుంట/ఎన్ఏడీ జంక్షన్, జూలై 3: జీవీఎంపీ 94వ వార్డులో రూ.40లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. నాయుడుతోట అప్పలనర్సయ్యనగర్ కొండపై భాగంలో రూ.30 లక్షలతో రోడ్డు, కాలువల నిర్మాణాలను, అప్పలనరసయ్య కాలనీ, గంగిరెడ్ల కాలనీలో కొత్తగా వేసిన బోరులను ప్రారంభించారు. వేపగుంట అన్న క్యాంటీన్ మరమ్మతు పనులకు పూజలు చేశారు. డీఈ విజయకుమార్, స్థానిక నాయకులు వేణు, కిరణ్, దేముడు, వాసు తదితరులు పాల్గొన్నారు. అలాగే 90వ వార్డు బాజీ జంక్షన్ సంత వెనక అన్న క్యాంటీన్‌లో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ, డీఈ విజయ్‌కుమార్, ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, నాయకులు ఎలమంచిలి ప్రసాద్, పైడిరాజు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులకు సత్కారం

అగనంపూడి, జూలై 3: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థానిక శాఖలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న ఎస్.ప్రసాద్, ఎల్.శృతిలను బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంతో పాటు బ్యాంకు పురోభివృద్ధికి ప్రసాద్, శృతి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు బి.సత్యనారాయణ, ఎ.శ్రీనివాసరావు, బి.రామకృష్ణ, టి.రాము, ఆదిలక్ష్మి, లీల, కృష్ణవేణి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్ టెన్నిస్‌కి హాసిని ఎంపిక


పతకాలతో హాసిని

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 3: సీబీఎస్‌ఈ రీజనల్ స్పోర్ట్స్ టెన్నిస్ టోర్నీలో నగరానికి చెందిన హాసిని ప్రతిభ చూపింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ టోర్నీ బాలికల అండర్-17 విభాగంలో వ్యక్తిగత, టీం ఈవెంట్లలో ప్రాతినిధ్యం వహించిన హాసిని..అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించి రజత పతకాలు సాధించింది. అలాగే, త్వరలో జరగనున్న సీబీఎస్‌ఈ జాతీయ స్కూల్ గేమ్స్ టెన్నిస్ టోర్నీలో పాల్గొనేందుకు అర్హత సాధించింది.

సాహిత్యంలో 'బలివాడ'ది ప్రత్యేక అధ్యాయం

సీతంపేట, జూలై 3: తెలుగు నవల, కథా సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన అధ్యాయాన్ని బలివాడ కాంతారావు సృష్టించారని రచయిత డాక్టర్ కేజీ వేణు పేర్కొన్నారు. సీతంపేటలోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బలివాడ కాంతారావు జయంతి సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ బలివాడ కాంతారావు తెలుగు వారు గర్వించదగ్గ రచయిత అన్నారు. రచయిత డాక్టర్ కేజీ వేణు మాట్లాడుతూ రచయిత బలివాడ కాంతారావు బాల్యంలోనే స్కూల్ మేగజైన్‌కు సంపాదకులుగా పనిచేశారన్నారు. ఆయన 38 వరకు నవలు, 400ల కథలు, ఐదు నాటికలు, రేడియో నాటికలు రాశారన్నారు. నిజాయితీ, నిక్కచ్చితనం, జాలి, దయ, కరుణ తదితర అంశాలు ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించేవన్నారు. 1998లో బలివాడ కథల సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డీవీ సూర్యారావు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సూరపనేని విజయకుమార్, సీహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, ఆక్టర్, కేపీఎస్ మూర్తి, పీవీఆర్ కుమారరావు, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు నిర్ణయించాలి

అక్కయ్యపాలెం, జూలై 3: షెడ్యూల్డ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించాలని కోరుతూ అమరావతిలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, కార్మిక శాఖ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబుకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి. వెంకటరెడ్డి వినతిపత్రమిచ్చారు. కనీస వేతనాల చట్టం 1948, సెక్షన్-5 ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి వేతనాలు సవరించాల్సి ఉన్నా, నేటికి 17 ఏళ్లయినా పెంచకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు. పెరిగే ధరలతో వేతనాలు చాలక కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఇప్పటికైనా ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు సవరించాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో ఆర్టీసీ యూనియన్ నాయకులు తులసీరామ్, శ్రావణ్ ఉన్నారు.

పలు రైళ్లు రద్దు...రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 3: పలాస, విజయనగరం మెయిన్ లైనులో భద్రత పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడంతోపాటు, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు

ఈనెల 5న పలాస-విశాఖ (07471), విశాఖ-పలాస (07470), గుణుపూర్-విశాఖ (085 21), విశాఖ-గుణుపూర్ (08522), విశాఖ-భవానీపట్న (08504), విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ (22820) రద్దు చేశారు. అలాగే, ఈనెల 6న భవానీపట్న- విశాఖ (08503), బ్రహ్మపూర్ - విశాఖ (08531), భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ (22819) రద్దు. ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఈనెల 5న భువనేశ్వర్- రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ (20896) రెండున్నర గంటలు, టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) గంటన్నర, సంబల్‌పూర్ - నాందేడ్ నాగావళి ఎక్స్‌ప్రెస్ (20809) రెండు గంటలు, సంత్రాగచ్చి - తంబరం ఎక్స్‌ప్రెస్ (16090) మూడున్నర గంటలు, విశాఖ - విజయనగరం మెము (07468) రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయి. అలాగే, ఈనెల 4న ముంబాయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) మూడున్నర గంటలు ఆలస్యంగా వెళ్లనుంది.



చదువుతోనే ఉన్నత శిఖరాలు

» దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, జూలై 3: చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని, అటువంటి విద్యను ఎట్టిపరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయరాదని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని రమాదేవి జోనోజీరావు ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాఠశాలలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టి తీసుకురావాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలో అన్నివసతులు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హెచ్. ప్రభాకరరావు, ఎంఈఓలు బి. పైడాపునాయుడు, బి. పుష్యరాగం, బిపిన్‌కుమార్, వానపల్లి గాయత్రిఫణికుమారి, సారిపల్లి మహేష్, దాము యాదవ్, విజయానందరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మొకర గోపి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

విశాఖ, దువ్వాడ స్టేషన్లలో రైల్వే జీఎం తనిఖీలు


దువ్వాడ స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్, అధికారులు

విశాఖపట్నం, జూలై 3: తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ బుధవారం విశాఖ, దువ్వాడ రైల్వే స్టేషన్లతోపాటు వడ్లపూడిలోని వ్యాగన్ వర్కుషాపులో పర్యటించారు. ముందుగా విశాఖలో ప్రయాణికుల మౌలిక సదుపాయాలకు సంబంధించి వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫామ్‌లపై పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, స్టాల్స్‌లో అమ్మకాలు, ఆహార పదార్థాల నాణ్యత తదితర అంశాలను తనిఖీ చేశారు. అధికారులతో చర్చించారు. అనంతరం జ్ఞానాపురం ప్రవేశ ద్వారం వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి గతి శక్తి అధికారులతో మాట్లాడారు. అలాగే, మార్షలింగ్ యార్డు, కోచింగ్ యార్డులలో పర్యటించి నిర్వహణ పనులను తనిఖీ చేశారు. అనంతరం వడ్లపూడిలోని వ్యాగన్ వర్కుషాపుకు చేరుకుని పరిశీలించారు. వర్కుషాపులో సామర్థ్యం పెంపునకు అవసరమైన సదుపాయాల ఏర్పాటుపై చీఫ్ ప్రాజెక్టు మేనేజర్‌తో చర్చించారు. అక్కడ నుంచి దువ్వాడ స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికుల వెయిటింగ్ హాల్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, తాగునీరు సదుపాయాలను పరిశీలించారు. అనంతరం రైలు వినియోగదారుల సంఘం సభ్యులు వివరించిన పలు సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి: డీఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో చంద్రకళ

డాబాగార్డెన్స్, జూలై 3: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతతో, మరింతగా రుచిరకంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డీఈవో ఎల్. చంద్రకళ, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సూచించారు. 'నాణ్యతలేని మధ్యాహ్నం భోజనం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురించినకథనానికి స్పందించి పాఠశాల సందర్శనకు వచ్చిన సందర్భంగా వారు మధ్యాహ్నం భోజనాల మెనూ పరిశీలించారు. బిరియాని, చెక్కి, అలూ కుర్మా రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహారం బాగుందని అయితే మరింత రుచిగా విద్యార్థులకు నచ్చేలా అందజేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఏవీ సత్యనారాయణ, జే.ఎస్.శాస్త్రి వంటలను స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన

జ్ఞానాపురం, జూలై 3: 41వ వార్డులోని బాబుకాలనీ, సెబాస్టెయిన్ కాలనీల్లో జోనల్ కమిషనర్ ఆర్.జీ.వి. కృష్ణ, వైద్యాధికారి సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో పారిశుధ్యంపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా పాటలు, నృత్యాల ద్వారా ప్లాస్టిక్ సంచులువాడకంతో దుష్ఫలితాలు, దోమలు నియంత్రణ, తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం ద్వారా కాలనీలు పరిశుభ్రంగా ఉంటాయని వివరించారు.

రూ. 39.80 లక్షలతో పార్కులో అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, జూలై 4 ; గ్రేటర్ 51వ వార్డు మాధవధార కళింగనగర్ ఈస్ట్ పార్కులో పలు అభివృద్ధి నిర్మాణాలకు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు బుధవారం భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. పార్కులో రూ.39. 80 లక్షలతో వాకింగ్ ట్రాక్ విస్తరణ, ఓపెన్ జిమ్ ఏర్పాటు, మరమ్మతులు, టాయ్‌లెట్ తదితర సౌకర్యాలను కల్పించనున్నారు. దీనికి కోసం ఉదయం ఆయన పార్కులో కమిటీ ప్రెసిడెంట్ మురళీ, ఇంజనీరింగ్ అధికారులు, టీడీపీ నాయకులతో కలసి పూజా కార్యక్రమాల్లో హాజరయ్యారు. విస్తరించిన మురళీనగర్, మాధవధార ప్రాంతాలకు అనుగుణంగా ఈ పార్కులో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. వ్యాయామ అవసరాలతో పాటు, పిల్లలకు ఆహ్లాదం కోసం రెండెకరాల సువిశాలమైన పార్కులో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి సనపల.వరప్రసాద్, 51వవార్డు అధ్యక్షుడు సనపల.కీర్తి, బీజేపీ నాయకులు, జనసేన వార్డు అధ్యక్షులు, మహిళా నాయకులుకార్యక్రమంలో ఉన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి పలువురు అభినందన

సీతమ్మధార: ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు పలువురు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. సీతమ్మధారలో బీజేపీ కార్యాలయంలో వైద్యులు, పలు పార్టీల నాయకులు, అభిమానులు ఆయనను కలిసి సన్మానించారు.

లాభాలు ఆర్జించే పంటలు వేయాలి


మాట్లాడుతున్న ఏడీ సత్యనారాయణ రెడ్డి

కంచరపాలెం, జూలై 3: తక్కువ ఖర్చుతో సాగు చేసి లాభా లు ఆర్జించే పంటలపై రైతులు దృష్టిసారించాలని హార్టీ కల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.సత్యనారాయణరెడ్డి సూచించారు. రైతులకు కూరగాయలు పెంపకంపై బుధవారం కంచరపాలెం రైతుబజారులో అవగాహన సదస్సును అవగాహన సదస్సును నిర్వహించారు. సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. పందిర కూరగాయల సాగు, వేసవి పంటలు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరించారు. పందిరి కూరగాయల పెంపకంతో స్వల్పకాలంలోనే లాభాలు చేకూరుతాయన్నారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తిచేశారు.ఎస్టేట్ అధికారి సీహెచ్.కృష్ణమూర్తి, మార్కెటింగ్ ఏడీ యాసిన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం కార్డుదారులకు గోధుమ పిండి

విశాఖపట్నం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బియ్యం కార్డుదారులకు గోధుమ పిండి సరఫరాకు అధి కారులు నిర్ణయించారు. ప్రతికార్డుదారుడికి కిలో గోధుమ పిండి రూ.16కు అందించనున్నారు. అయితే, ప్ర తినెలా బియ్యంతోపాటు పంచదార అరకిలో పంపిణీ చేసేవారు. రాష్ట్రంలో పంచదార సరఫరా విషయంలో ప్రధానంగా బరువు తక్కువగా ఉండడంతో సమస్య ఏర్పడింది. బరువు విషయంలో కాంట్రాక్టర్లను పిలిచి వివరణ కోరింది.ఈ నేపథ్యంలో జూలైగాను పంచదార సరఫరా జరిగే అవకాశం లేదని అధికారులు భావిస్తున్నారు.

షేక్ రషీద్ హాఫ్ సెంచరీ.. కోస్టల్ రైడర్స్ విజయం

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 3: ఏపీఎల్ సీజన్-3లో భాగంగా బుధవారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో కోస్టల్ రైడర్స్ 8పరుగుల తేడాతో బెజవాడ టైగర్స్‌పై గెలుపొందింది. కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 170 పరుగులు చేసింది. ఓపెనర్ కెప్టెన్ షేక్ రషీద్ అర్ధసెంచరీ (67; 5బౌండరీలు, 3 సిక్సర్లు) సాధించగా, అభిషేక్ రెడ్డి (35; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), ధరణికుమార్ (14), హర్షవర్ధన్ (14) రాణించారు.కార్తీక్ రామన్ నాలుగు బౌండరీలతో 19 పరుగులు చేశాడు. బెజవాడ టైగర్స్ బౌలర్లలో కె.సాయితేజ రెండు వికెట్లు పడగొట్టగా హరిశంకర్‌రెడ్డి, అఖిల్, లలిత్ మోహన్ తలో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెజవాడ టైగర్స్ 9 వికెట్లకు 162 పరుగులు మాత్రమే చేసింది. ధ్రువకుమార్‌రెడ్డి (45;4 బౌండరీలు, 3 సిక్సర్లు), కెప్టెన్ రిక్కీ బుయ్ (34; 3 బౌండరీలు, ఒక సిక్సర్), పైలా అవినాష్ (42; 4 సిక్సర్లు) రాణించగా మిగిలినవారు పెవిలియన్‌కు క్యూ కట్టారు. కోస్టల్ రైడర్స్ బౌలర్లలో స్టీఫెన్ (2/22), వై.ప్రమోద్ (2/35), కార్తీక్ రామన్ (2/44), షేక్ అబ్దుల్లా (1/33) రాణించారు. షేక్ రషీద్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

రాయలసీమ కింగ్స్ విజయం

మరో మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో గోదావరి టైటాన్స్ విజయం సాధించింది. తొలి బ్యాటింగ్ చేసిన గోదావరి నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 175 పరుగులు చేసింది. ఓపెనర్లు కెప్టెన్ జ్ఞానేశ్వర్ (20), వంశీ కృష్ణ అర్ధ సెంచరీ (57; 3 ఫోర్లు, 5 సిక్సర్లు) శుభారంభాన్నిచ్చారు. మిడిల్ ఆర్డర్‌లో ఎస్‌డీఎన్‌వీ.ప్రసాద్ (21), టీవీ జయ్(16), కేవీ.శశికాంత్ (36; 1 బౌండరీ, 3 సిక్సర్లు), సందీప్ (12 నాటౌట్) రాణించారు. రాయలసీమ కింగ్స్ బౌలర్లలో గిరినాథరెడ్డి, సత్యనారాయణరాజు చెరో రెండు వికెట్లు పడగొట్టగా మహ్మద్ రఫీ, కమరుద్దీన్ చెరో వికెట్ తీసారు. అనంతరం బ్యాటింగ్ చేసిన రాయలసీమ కింగ్స్ 18.3 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని చేధించింది. డీబీ.ప్రశాంత్‌కుఆమర్ (49; 4 బౌండరీలు, 3 సిక్సర్లు) అర్ధసెంచరీ చేజారగా, రోషన్‌కుమార్ పవన్ అజేయ అర్ధ సెంచరీ , గుత్తా రోహిత్ (39;3 బౌండరీలు, 3 సిక్సర్లు) రాణించి విజయాన్నందించారు. కేవీ.శశికాంత్, తేజ, సమన్వత్ తలో వికెట్ తీశారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, VETHSA VENKATESH (Old Name) S/o. Late. Vetcha Venkata Jagannadham, resident of D.No. 2-2-2/3, Sector-9, MVP Colony, Visakhapatnam-17. Change my name from VETHSA VENKATESH (Old Name) to VETCHA VENKATESH (New Name) henceforth I am being called as VETCHA VENKATESH (New Name) S/o. Late. Vetcha Venkata Jagannadham, for all purposes.
AJV_ 192979

CHANGE OF NAME

★ I, PAPPU SANTHI (Old Name) W/o. Pappu Laxmana Rao, resident of D.No.71-31-107/1, Gudivada Appanna Colony, Malkapuram, Visakhapatnam. Change my name from PAPPU SANTHI (Old Name) to PAPPU PARVATAMMA (New Name) henceforth I am being called as PAPPU PARVATAMMA (New Name) W/o. Pappu Laxmana Rao, for all purposes.
AJV_192983

CHANGE OF NAME

★ I, EERLI SURESH (Old Name) S/o. Earli Pathri Naidu, resident of Jaithavaram, Cheedikaada, Visakhapatnam. Change my name from EERLI SURESH (Old Name) to EARLI SURESH (New Name) henceforth I am being called as EARLI SURESH (New Name) S/o. Earli Pathri Naidu, for all purposes.
AJV_192982

CHANGE OF NAME

★ I, SEEPNA SRINIVASARAO (Old Name) S/o. Seepana Adinarayana, resident of 11-14/15, Carpenters colony, Madhurawada, Visakhapatnam. Change my name from SEEPNA SRINIVASARAO (Old Name) to SEEPANA SRINIVASA RAO (New Name) henceforth I am being called as SEEPANA SRINIVASA RAO (New Name) S/o. Seepana Adinarayana, for all purposes.
AJV_192981

CHANGE OF NAME

★ I, JOSYULA SRUJANA (Old Name) W/o. Ramamuni Ramesh Babu, resident of D.No.55-7-30, Sanjay Gandhi colony, HB Colony, Visakhapatnam. Change my name from JOSYULA SRUJANA (Old Name) to RAMAMUNI SRUJANA (New Name) henceforth I am being called as RAMAMUNI SRUJANA (New Name) W/o. Ramamuni Ramesh Babu, for all purposes.
AJV_ 1201

CHANGE OF NAME

★ I, ZAINUL ABEDIN (Old Name) S/o. Mohammed Sarfaraz Khatha, resident of 3-1/3-6, Rehmat House, Arakala Gedda Veedhi, Vizianagaram. Change my name from ZAINUL ABEDIN (Old Name) to ZAINUL ABEDIN KHATHA (New Name) henceforth I am being called as ZAINUL ABEDIN KHATHA (New Name) S/o. Mohammed Sarfaraz Khatha, for all purposes.
AJV_ 192980

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

For Advertisement Contact :
9963231176
9966165093

కలెక్టర్‌కు అధికారులు, రెవెన్యూ ఉద్యోగుల అభినందనలు


నూతన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న జేసీ అశోక్, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, రెవెన్యూ అధికారులు

విశాఖపట్నం, జూలై 3: నూతనంగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్‌ను జేసీ మయూర అశోక్, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రెవెన్యూ ఉద్యోగులుఈసందర్భంగా పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

» జీతాలు, పింఛన్లు జమ
» నాలుగేళ్ల తర్వాత సమయానికి విడుదల
» ఉద్యోగ వర్గాలు, రిటైర్డ్ ఉద్యోగుల్లో సంతోషం

విశాఖపట్నం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సుమారు నాలుగేళ్ల తరువాత ఉద్యోగులకు జీతాలు, రిటైర్డు ఉద్యోగులకు పింఛన్లు సకాలంలో అందాయి. జూన్‌నెలకు సంబంధించి జీతాలు ఈ నెల ఒకటో తేదీ ఉదయం నుంచి ఉద్యోగుల ఖాతాలకు జమ కావడం ప్రారంభమైంది. దాదాపు మెజారిటీ ఉద్యోగులకు రెండో తేదీనే జమకాగా, మిగిలిన వారికి బుధవారం బట్వాడా చేశారు. ఉపాధ్యాయులకు ఈనెల ఒకటోతేదీ రాత్రి నుంచి ఖాతాలకు జీతాలు జమచేశారు. రిటైర్డు ఉద్యోగులకు పింఛన్ల సొమ్ము ఈనెల రెండోతేదీ నాటికే అందించారు. దాదాపు నాలుగున్నరేళ్ల తరువాత ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల ఖాతాలకు ఇంత త్వరగా జీతాలు, పింఛన్లు జమకావడంతో వారిలో సంతోషం వ్యక్తమవుతోంది. జిల్లాలో అన్ని కేటగిరీలు కలిసి 40 వేల మంది ఉద్యోగులు, 18 వేల మంది పింఛన్‌దారులున్నారు. వైసీపీ అధికారంలోనికి వచ్చిన కొన్ని నెలలు ఒకటో తేదీకి జీతాలు , పింఛన్లు బట్వాడా జరిగేవి. తర్వాత ప్రతినెలా రోజుల తరబడి నిరీక్షణ తప్పలేదు. జీతాలకోసం ఉద్యోగులు ఆందోళనలు చేయడంతో ప్రభుత్వం నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో ఉద్యోగులు, పింఛన్లదారులు మౌనంగా నాలుగేళ్ల పాటు బాధ భరించారు. జీతాలు, పింఛన్‌లకు ప్రతినెలా వారం, పదిరోజులు ఒక్కొక్క సారి 15 రోజుల వరకు వేచి చూడడం పరిపాటైంది. ఈ స్థితిలో వీరిలో అసంతృప్తి నెలకొని ఇటీవల జరిగిన ఎన్నికలో అధికార వైసీపీకి వ్యతిరేకంగా ఓటేశారు. అలాగే, ఎన్నికల్లో ఒకటోతేదీకి జీతాలు, పింఛన్లు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా ఈ నెల ఒకటోతేదీ నుంచి మూడోతేదీలోగా చెల్లింపులకు చర్యలు తీసుకున్నారు. సాధారణంగా ఉద్యోగులు ఎక్కువమంది బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు జీతాలనుంచే వాయిదాలు చెల్లిస్తుంటారు. నాలుగున్నరేళ్ల నుంచి సకాలంలో జీతాలు రాక వాయిదాల కోసం ఇబ్బంది పడ్డారు. వేలమంది ఉద్యోగులకు బ్యాంకులు సర్‌చార్జీ విధించాయి. ఈ నెలలో మూడోతేదీలోగా జీతం జమకావడంతో ఇంతకాలానికి ఎదురుచూపులు తప్పాయని టీచర్లు, ఉద్యోగులు ఆనందం వ్యక్తంచేశారు. చంద్రబాబునాయుడు మాట నిలుపుకున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు పేర్కొన్నారు. దీనికితోడు పలువురు ఉద్యోగులకు బకాయిలు కూడా జీతాలతోపాటు విడుదలచేశారరన్నారు. గత నాలుగేళ్ల తర్వాత రెండోతేదీనే పింఛన్ జమ కావడం ఆనందంగా సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఆనందరావు అనే నీటిపారుదల శాఖ ఉద్యోగి సంతోషం వ్యక్తంచేశారు.

నామినేటెడ్ పదవి కేటాయించాలని వినతి

జ్ఞానాపురం, జూలై 3: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి గత 30 ఏళ్లుగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్న తమకు శాసనమండలి లేదా నామినేటెడ్ చైర్మన్ పదవి కేటాయించాలని ముఖ్యమంత్రిని గ్రేటర్ 33వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి విల్లూరి తిరుమలాదేవి, చక్రవర్తి దంపతులు కోరారు. మంగళగిరిలోని పార్టీకార్యాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో బీజేపీ నేతలు భేటీ

మహరాణిపేట, జూలై 3: కేజీహెచ్ సూపరిం టెం డెంట్ డాక్టర్ శివానంద్‌ను భారతీయ జనతా పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర బుధవారం మర్యాదపూర్వకంగా కలి శారు. కేజీహెచ్‌లో పరిస్థితు లు, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నా రు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం దానే శ్వరరావు, మెడికల్ సెల్ జిల్లా కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ భూతం భాగ్యలక్ష్మి, డి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీపీఐ సమావేశాలు

మాధవధార, జూలై 3; మురళీనగర్‌లో నిర్వహించిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు బుధవారంతో ముగిశాయి. తొలి రోజు సోమవారం పార్టీ అంతర్గత సమావేశాలు, మంగళవారంఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పరిణామాలపై మాట్లాడారు. ఆఖరి రోజు బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కార్యవర్గ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

కంచరపాలెం, జూలై 3 : వివాహిత అదృశ్యంపై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. కంచరపాలెం మెట్టు సమీపంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న కాకర మౌనిక (19) భర్త గోపాలస్వామితో కలిసి ఉంటున్నారు. జూన్ 29తేదీన డ్యూటీకి వెళ్లిన మౌనిక ఇంటికి తిరిగి రాకపోవడంతో గోపాలస్వామి బుధవారం ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

... 3వ పేజీ తరువాయి

పెట్టుబడులు తీసుకువచ్చేలా ప్రయత్నిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా స్థిరపడేలా ఉపాధి కల్పనకు అనువుగా శిక్షణ కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తామన్నారు. పర్యాటకంగా ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు తీసుకువచ్చేందుకు యత్నిస్తానన్నారు. జిల్లాలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా, మంచి కనెక్టవిటీతో కూడిన రోడ్ల నిర్మాణం, కాలుష్య నియంత్రణ, పచ్చదనం పెంపుపై దృష్టిసారిస్తామన్నారు. ప్రపంచంలో ఆదర్శ నగరాల తరహాలో విశాఖను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని కలెక్టర్ అన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సమాన ప్రాధాన్యం ఇస్తానన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. జిల్లాలో ప్రభుత్వ భూముల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు. భూవివాదాల పరిష్కారంపై కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని లోతుగా అధ్యయనం చేస్తామన్నారు. నిజమైన భూ యజమానులకు న్యాయం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

కలెక్టర్‌కు స్వాగతం

కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ విజయవాడ నుంచి బుధవారం ఉదయం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ చేరు కున్నారు. తొలుత సింహాచలం వెళ్లి నృసింహస్వామిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు డీఆర్‌వో మోహన్‌కుమార్, ఏవో దేవప్రసాద్ స్వాగతం పలికారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరేంధిర ప్రసాద్‌కు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీవోలు హుస్సేన్‌సాగర్, భాస్కర్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు త్రినాథరావుతోపాటు ప్రతినిధులు రాజేంద్రవర్మ, యోగి, రవిశంకర్, సుధీర్, పలుశాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు.

సీపీకి సవాళ్లు

... 3వ పేజీ తరువాయి

సకాలంలో స్పందించడం లేదు.

రౌడీషీటర్లపై లోపించిన నిఘా

నగరంలో రౌడీషీటర్లపై నిఘా లోపించింది. దీంతో కొంతమంది రౌడీషీటర్లు సెటిల్‌మెంట్లు, రియల్ ఎస్టేట్ గొడవల పరిష్కారం, తమ ప్రాంతంలో ఆధిపత్యం కోసం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం చేస్తున్నారు. గతంలో ప్రతి రౌడీషీటర్‌కు ఒక్కో కానిస్టేబుల్‌ను అటాచ్‌మెంట్ చేసేవారు. దీనివల్ల రౌడీషీటర్ ఉదయం నుంచి రాత్రి నిద్రపోయేంత వరకూ ఎక్కడెక్కడ తిరిగాడు, ఎవరెవరితో మాట్లాడాడు...వంటి వాటిపై ఎప్పటికప్పుడు సమాచారం ఉండడంతో నేరాలకు పాల్పడేందుకు అవకాశం ఉండేది కాదు. అలాగే యాక్టివ్‌గా ఉండేవారిని నగరం నుంచి బహిష్కరించేవారు. గత కొంతకాలంగా నిఘా లోపించడంతో కొంతమంది రౌడీలు రెచ్చిపోతున్నారు.

మామూళ్ల మత్తులో పోలీసులు

నగర పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పనిచేసే కొంతమంది అధికారులు, సిబ్బంది మామూళ్ల మత్తులో జోగుతున్నారు. నగరంలోకి భారీ వాహనాల ప్రవేశంపై రద్దీ వేళల్లో నిషేధం ఉంది. అదేవిధంగా జనావాసాల్లో గోడౌన్లు ఏర్పాటుచేయడం కూడా నిబంధనలకు విరుద్ధం. కానీ కొన్ని ట్రాన్స్‌పోర్టు కంపెనీలు, సిమెంట్, ఐరన్, హార్డ్‌వేర్ వ్యాపారాలు చేసేవారంతా ట్రాఫిక్ పోలీసులను మామూళ్లతో మచ్చిక చేసుకుంటున్నారు. సమయంతో సంబంధం లేకుండా భారీవాహనాలు నగరంలోకి ప్రవేశించడానికి అవకాశం ఇస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ జామ్‌లు, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మద్దిలపాలెంలో ఐరన్, సిమెంట్ దుకాణాల వద్ద భారీ వాహనాలకు జాతీయ రహదారిపైనే ఉంచి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. దీని వల్ల అక్కడ ట్రాఫిక్ జామ్ అవుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోరు. రోడ్లపక్కన వ్యాపారాలు చేసుకునే తోపుడుబండ్ల నుంచి కూడా పోలీసులు రోజుకు రూ.50 నుంచి రూ.200 వరకూ వసూలు చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

స్టేషన్లలో సివిల్ సెటిల్‌మెంట్‌లు

నగర పరిధిలోని కొన్ని పోలీస్ స్టేషన్లలో సివిల్ సెటిల్‌మెంట్లు భారీగా జరుగుతున్నాయి. సివిల్ కేసుల జోలికి వెళ్లకూడదనే నిబంధన ఉన్నప్పటికీ భారీగా డబ్బులు వస్తాయనే ఆశతో పోలీసులు ఆయా కేసులపై ప్రత్యేక శ్రద్ధకనబరిచి, మిగిలిన కేసులను పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. వీటన్నింటిపైనా సీపీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నిర్లక్ష్యం నీడన అల్లూరి జన్మస్థలం

... 3వ పేజీ తరువాయి

నేటికీ పూర్తికాలేదు. కోనేరు వద్ద ఏర్పాటుచేసిన పార్కు నిర్వహణ లేక తుప్పలు, డొంకలు పెరిగి అధ్వానంగా ఉంది. అల్లూరి సామాజిక వేదిక కూడా వాహనాలు నిలుపుకునే స్థలంగా మారిపోయింది. ఈ గ్రామాన్ని ఒక స్ఫూర్తి కేంద్రంగా నిలిపి అల్లూరి జన్మ స్థలాన్ని పర్యాటకులు సందర్శించే విధంగా తీర్చిదిద్దడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. పర్యాటక శాఖ అధికారులు కూడా కేవలం జయంతి రోజు వచ్చి హడావుడి చేసి ఉత్సవం ముగిసిన తరువాత చేతులు దులుపుకొని వెళ్లిపోవడం ఏటా సాధారణమైపోయింది. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అల్లూరి అల్లూరి జయంతిని రాష్ట్రపండగలా జరపాలని 2014లోనే జీవో జారీచేశారు. గతంలో పర్యాటక శాఖా మంత్రిగా పని చేసిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు నగర సందర్శనకు వచ్చే పర్యాటకులు పద్మనాభం మండలం అల్లూరి జన్మస్థలం, పద్మనాభ యుద్ధ స్థలం, పొట్నూరులో శ్రీకృష్ణదేవరాయల విజయస్థూపం వంటి చారిత్రక స్థలాలతో పాటు, ఆలయాలను కూడా సందర్శించే విధంగా ప్రత్యేక పర్యాటక ప్యాకేజీ రూపొందిస్తామని ప్రకటించారు. ఆ హామీ ప్రకటనలకే పరిమితమయ్యింది. ఇదిలావుండగా గురువారం అల్లూరి జయంతి వేడుకలు చేయడానికి సన్నాహాలు చేస్తున్న తరుణంలో ఆయన జనన గృహం మరమ్మతు పనులు బుధవారం నాటికి కూడా పూర్తికాలేదు. ఏదో మొక్కుబడిగా జయంతి ముందురోజు హడావిడి చేయకుండా నెలరోజులు ముందుగానే కార్యాచరణ రూపొందించి పనులు చేపడితే ఉత్సవాలకు సార్థకత ఉంటుంది. ఇకనైనా ఈ ప్రాంతానికి పర్యాటకంగా ప్రాచుర్యం కల్పించి అల్లూరి జనన స్థలాన్ని భావితరాలు సందర్శించే విధంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

అవి నిరర్థక ఆస్తులు

... 3వ పేజీ తరువాయి

లాబీయింగ్ చేస్తూ యాజమాన్యంతో భూములు అమ్మించేందుకు యత్నిస్తోందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కమీషన్లు భారీగా వస్తాయనుకుంటే...ఎటువంటి అమ్మకాలు, కొనుగోళ్లకైనా తల ఊపే ఉన్నతాధికారులు ఉండడం వల్ల కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవ నిరర్థక ఆస్తులైన హెచ్‌బీ కాలనీ, పెదగంట్యాడ కాలనీల భూముల అమ్మకంపై తమకు అభ్యంతరం లేదని, స్టాక్‌యార్డుల భూముల విక్రయాన్ని అంగీకరించబోమని స్పష్టం చేస్తున్నారు. హైకోర్టులో స్టే తొలగించడానికి యాజమాన్యం ప్రయత్నిస్తే నాయకులు ఏమని వాదిస్తారో చూస్తామని, వారు సరైన రీతిలో స్పందించకపోతే తాము ఇంప్లీడ్ అవుతామని కార్మిక వర్గాలు చెబుతున్నాయి.

ఆక్రమణలో జట్లమ్మ కొండ స్థలం

» పది సెంట్లలో అక్రమంగా నిర్మాణాలు
» ఫిర్యాదు చేసినా... పట్టని రెవెన్యూ అధికారులు

ఆనందపురం, జూలై 3 : ఆనందపురం పంచాయతీ పరిధిలోని జట్లమ్మ కొండవాలు ప్రాంతం ఆక్రమణకు గురవుతోంది. కొంతమంది ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రేకుల షెడ్లు ఏర్పాటు చేస్తున్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ సర్వే నెంబర్లు 276, 273లో బాలికల వసతి గృహం నిర్మించారు. దీనికి సమీపంలో శ్రమ జీవుల కాలనీకి కొంత స్థలాన్ని కేటాయించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు 2.5 ఎకరాల స్థలం ఇచ్చారు. అయితే వసతి గృహానికి ఆనుకుని ఉన్న సుమారు రూ. 30 లక్షల విలువ చేసే పదిసెంట్ల స్థలాన్ని కొంత మంది దౌర్జన్యంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పాటు వసతి గృహం అవసరాల కోసం ఉంచిన స్థలంలో పశువులను కట్టి అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారు. బాలికలు వసతి గృహం నుంచి బయటకు వచ్చి ఉందామంటే దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వసతి గృహం అధికారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్ హేమంత్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని, మూడు రోజుల్లోగా తొలగించకపోతే తామే స్వయంగా తొలగిస్తామని చెప్పారు.



ఆక్రమణకు గురైన స్థలం

మానం ఆంజనేయనగర్‌లో ఇళ్ల పట్టాల పరిశీలన

మధురవాడ, జూలై 3 : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మానం ఆంజనేయనగర్‌లో రెవెన్యూ అధికారులు బుధవారం ఇంటింటి సర్వే చేశారు. కాలనీలో నకిలీ పట్టాలతో పలువురు ఇళ్లు నిర్మించుకున్నారని వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈమేరకు చినగదిలి మండల డిప్యూటీ తహసీల్దార్ గోవింద్, పద్మనాభం మండల డిప్యూటీ తహసీల్దార్ కిశోర్, ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సంజీవరావు మూడు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టారు. సర్వే నంబరు 125/పి, 126/2లో అప్పటి ఎమ్మెల్యేలు మానం ఆంజనేయులు, పల్లా సింహాచలం 325 పట్టాలు నిరుపేదలకు ఇప్పించారు. 1998 లో ఆ స్థలమంతా ఎత్తు పల్లాలు, గోతులతో ఉండడంతో కొందరు ఇళ్లు నిర్మించుకోలేదు. కాలక్రమంలో కొందరు ఇంటి స్థలాలను విక్రయించి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో కొందరు నకిలీ పట్టాలతో ఇళ్లు నిర్మించుకున్నారని కార్పొరేటర్ మంగమ్మ ఇటీవల భీమిలి ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు కాలనీలోని 325 మంది లబ్ధిదారుల వివరాలు సేకరించాలని మూడు బృందాలను నియమించింది.బుధవారం వారు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఒక ప్రొఫార్మా అందించి వివరాలు సేకరించారు. పట్టా ఎప్పుడు ఇచ్చారు, లబ్ధిదారుడి పేరు, ఆధార్ నంబరు, పట్టా నంబరు, విద్యుత్ కనెక్షన్ నంబరు, ఒకవేళ లబ్ధిదారుడి నుంచి పట్టా కొనుగోలు చేస్తే ప్రస్తుత లబ్ధిదారుడి వివరాలు,అమ్మిన వ్యక్తి వివరాలు సేకరిస్తున్నారు. సర్వేలో తెలిసిన వాస్తవ వివరాలు మేరకు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని సర్వే చేపట్టిన అధికారులు తెలిపారు.



కాలనీలో ఒక ఇంటి వద్ద సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు



కోతకు గురైన గంధవరం కల్వర్టు

గంధవరంలో కల్వర్టు శిథిలం

పద్మనాభం (రూరల్), జూలై 3: గంధవరం-అనంతవరం రహదారిలో శిథిలమైన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అనంతవరం నుంచి వైఎస్ఆర్ కాలనీ వరకు రోడ్డు బాగున్నా.. సమీపంలోని గెడ్డ వద్ద కల్వర్టు శిథిలం కావడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో కల్వర్టు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత కొన్నేళ్లుగా గ్రామస్థులు కల్వర్టు మరమ్మతు గురించి పాలకులు, అధికారులకు విన్నవిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'వలంటీర్లు జగన్ ఇంటికి వెళ్లాలి'

ఎంవీపీ కాలనీ, జూలై 3 : వలంటీర్లు చలో అమరావతి కాకుండా చలో తాడేపల్లి కార్యక్రమాన్ని చేపట్టాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వలంటీర్లతో జగన్ గొడ్డు చాకిరీ చేయించుకున్నారని, వారిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని టీడీపీ చెప్పినా, పెడచెవిన పెట్టి, రాజీనామాలు చేయించారన్నారు. ఇప్పుడు వారంతా జగన్ ఇంటికి వెళ్లి తమ సంగతేమిటని ప్రశ్నించాలన్నారు.

కొత్తూరు గెడ్డలో పూడికతీత

భీమునిపట్నం, జూలై 3 : జీవీఎంసీ 4వ వార్డు కొత్తూరు గెడ్డలో బుధవారం నుంచి పూడికతీత ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమిలి జోన్ పబ్లిక్ వర్క్స్ ఏఈ సుమన్‌తో మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని భీమిలి జోన్ పరిధిలో ఉన్న నాలుగు వార్డుల్లో ప్రధానమైన 37 గెడ్డలు, కాలువల్లో పూడితతీత, జంగిల్ క్లియరెన్స్ పనులకు రూ. 35 లక్షల జీవీఎంసీ నిధులు మంజూరయ్యాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు,సీనియరు నాయకులు కారి అప్పారావు, మైలపల్లి రాము, చీపుళ్ళ శ్రీనివాసరావు, సూరాడ రవి, గరికిన శ్రీను, వాసుపల్లి పోలమ్మ, పాసి త్రినాథ్ కుమార్, పాసి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, జూలై 3 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు రకాల పుష్ప మాలికలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

భీమునిపట్నం, జూలై 3 : పట్టణంలోని జీవీఎంసీ పండిట్ నెహ్రూ హైస్కూల్ విద్యార్థులకు 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ బుధవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, స్కూల్ హెచ్ఎం తిరుమల శ్రీదేవి, శ్రీను మాస్టర్, నాయకులు సంజీవ్‌కుమార్, సత్తరవు శివ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, శారద, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 22, పచ్చిమిర్చి 80, కాకరకాయలు 48, బీరకాయలు 38, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 34, క్యారేట్ 36, దొండకాయలు 20, బంగాళా దుంపలు 32, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 86, అల్లం (పాతది) 145, బరబటి 54, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 200, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 32, కీరదోస 30, కాప్సికమ్ 74, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 40, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 110
ఫారం ధర	-- 130
విత్ స్కిన్	-- 230
స్కిన్‌లెస్	-- 240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్సీ శైలజావల్లి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం : జడ్సీ

సాగర్‌నగర్, జూలై 3 : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని జోన్ టు జోనల్ కమిషనర్ శైలజా వల్లి సూచించారు. బుధవారం ఆమె సాగర్ నగర్ పీహెచ్‌సీ ఆవరణలో డయేరియా, డెంగ్యూ, మలేరియా నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్యాధికారి భరత్ మాట్లాడుతూ డయేరియా, డెంగ్యూ, మలేరియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలన్నారు. ఏమాత్రం అనారోగ్య సమస్య తలెత్తినా ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ కిషోర్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రవి, మలేరియా ఇన్‌స్పెక్టర్ మంగరాజు, ఎన్. శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

రజక వీధి సమస్యలపై కార్పొరేటర్ ఆరా

సింహాచలం, జూలై 3 : గుడ్ మార్నింగ్ కార్పొరేటర్ కార్యక్రమంలో భాగంగా 98వ వార్డు పరిధిలోని సాయిమాధవనగర్, అప్పన్నపాలెంలోని రజక వీధుల్లో కార్పొరేటర్ పివి నరసింహం బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు స్థానిక సమస్యలను ఆయనకు సమగ్రంగా వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, బిసి విభాగం అధ్యక్షుడు గండ్రెడ్డి వెంకటరమణ, జీవీఎంసీ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పాల్గొన్నారు.

కళాభారతిలో పాతాళభైరవి నాటిక ప్రదర్శన



మాయబజార్ నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం, జూలై 3 : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో సురభి నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం పాతాళ భైరవి నాటకం ప్రదర్శించారు. తోటరాముడు, మాంత్రికుడు, పాతాళభైరవి, ఇందుమతి వంటి వివిధ వేషధారణలతో కళాకారులు అలరించారు. మాయ సన్నివేశాల ఎఫెక్టులతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశారు. తోటరాముడుగా మధుసూదనరావు, అంజి వేషధారణలో నాగబాబు హాస్య సన్నివేశాలు నవ్వులు పూయించాయి. కార్యక్రమంలో రంగసాయినాటిక నిర్వాహకుడు బాదంగీర్ సాయి, కళాభారతి అధ్యక్షుడు రాజు, కార్యదర్శి రాంబాబు, రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

కొమ్మాది, జూలై 3 : పీఎంపాలెం శివారు శృంగేరి శంకర మఠంలో వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులు జాగర్లపూడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్ష ఫీజు చెల్లింపునకు 15 వరకూ గడువు

భీమునిపట్నం, జూలై 3 : చెన్నైకు చెందిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించే హిందీ పరీక్షలకు ఈనెల 15వ తేదీలోగా ఫీజు చెల్లించాలని ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 14, 15 తేదీల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారికి ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని, వివరాలకు 8985897419, 8985647419 నంబర్లను సంప్రతించాలన్నారు.

గాయత్రినగర్‌లో స్వల్ప ఉద్రిక్తత



ఆలయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న దాసరి శ్రీనివాస్

కొమ్మాది, జూలై 3 : పీఎంపాలెం గాయత్రినగర్‌లో నిర్మించిన అమ్మవారి ఆలయం ప్రభుత్వ భూమిలో ఉందని చినగదిలి మండల రెవెన్యూ అధికారులు బుధవారం ఆలయం కూల్చివేతకు సిద్ధం కావడంతో ఉద్రిక్తత నెలకొంది. గాయత్రి నగర్‌లో కొంతకాలం క్రితం కాలనీవాసులు అమ్మవారి ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నిర్మాణ సమయంలో అడ్డుకోవాల్సిన రెవెన్యూ, సచివాలయ సిబ్బంది అప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు ఆలయం కూల్చివేతకు సిద్ధం కావడంతో కాలనీవాసులు అడ్డుకున్నారు. రెవెన్యూ సిబ్బందిని వారు తీవ్రంగా ప్రతిఘటించడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కేన్సర్ రోగికి రొబోటిక్ శస్త్ర చికిత్స

ఆరిలోవ, జూలై 3 : ఆరిలోవలోని హెల్త్ సిటీలో ఉన్న మెడికవర్ ఆస్పత్రిలో వైద్యులు 77 ఏళ్ల ప్రాంక్రియాటిక్ కేన్సర్ రోగికి ప్రత్యేక రొబోటిక్ సహాయంతో శస్త్ర చికిత్స చేశారు. ఈమేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ బిశ్వభూషన్‌దాస్ ఆధ్వర్యంలో ఈ శస్త్ర చికిత్స జరిగింది. ప్రపంచంలో అతి కొద్దిమంది సర్జనులు మాత్రమే ఈ శస్త్ర చికిత్స చేస్తారని చెప్పారు. ఈ ఆస్పత్రిలో ఇప్పటివరకు వంద శస్త్ర చికిత్సలు చేశామన్నారు.

నేడు మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి

సిరిపురం, జూలై 3 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 91వ జయంతి వేడుకలు సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో గురువారం నిర్వహించనున్నట్టు షైడా విద్యా సంస్థల అధినేత షైడా కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వేడుకలకు మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు, పీవీజీఆర్ గణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణశ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, లలితకుమారి, విశాఖ ఎంపీ శ్రీభరత్ హాజరుకానున్నట్టు చెప్పారు.

'కార్మికుల సంక్షేమానికి రాజీలేని పోరాటం'

ఉక్కుటౌన్‌షిప్, జూలై 3 : కార్మికుల సంక్షేమానికి రాజీలేని పోరాటం చేస్తామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో మెర్జ్ చేయాలని, అప్పుడే భవిష్యత్తు అన్నారు.

అప్పన్నను దర్శించుకున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

సింహాచలం, జూలై 3 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బుధవారం ఉదయం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయం ఈఓ శ్రీనివాసమూర్తి ఆహ్వానం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం తరువాత అంతరాలయంలో అర్చకులు పల్లా శ్రీనివాసరావు గోత్రనామాలతో స్వామివారికి ప్రత్యేక అర్చన చేశారు. గోదాదేవి దర్శించుకున్న తరువాత పండితులు ఆయనకు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

గ్రీన్ ట్యాక్స్ తగ్గించేందుకు కృషి

కూర్మన్నపాలెం: భారీ వాహనాలకు కంటకంగా మారిన గ్రీన్ ట్యాక్స్ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి దానిని తగ్గించేందుకు కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెంలో బుధవారం విశాఖపట్నం బల్క్, బిటూ మేన్ అండ్ ఎల్ఎస్‌హెచ్ఎస్ ట్యాంక్ ట్రక్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అగనంపూడి టోల్‌గేటును ఎత్తివేశామన్నారు. గాజువాకలో ట్రక్ టెర్మినల్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పల్లా శ్రీనివాసరావును అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, నాయకులు పుచ్చా విజయ్‌కుమార్, ఎం.కనకరాజు, అసోసియేషన్ ప్రతినిధులు ఆర్.కృష్ణమూర్తి, తులసీదాస్, రాజేశ్‌లాల్, సత్యనారాయణ, అహ్మద్, దేవన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.





కప్పస్తంభం వద్ద పల్లా, ట్యాంక్ ట్రక్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న పల్లా



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎంవీపీ కాలనీ, జూలై 3 : ఎంవీపీ కాలనీలోని భద్రం పార్కులో పలు అభివృద్ధి పనులకు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ. 12 లక్షల జీవీఎంసీ నిధులతో ఈ పార్కును ఆధునికీకరించనున్నారు. కాగా పార్కులోని గ్రంథాలయానికి ఎమ్మెల్యే వెలగపూడి చేతుల మీదుగా కొన్ని పుస్తకాలను గీతం యూనివర్శిటీ మాజీ లైబ్రేరియన్ డాక్టర్ సత్యనారాయణ వితరణగా అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మూసివేసిన కాలువ పరిశీలన

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెంలో అపార్ట్‌మెంట్ యజమాని డ్రైనేజీని మూసివేసి పనులు చేపట్టడంపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అధికారులతో కలిసి బుధవారం ఆ కాలువను పరిశీలించారు. తక్షణమే కాలువను ఎప్పటి మాదిరిగా ఉంచాలని యజమానిని ఆదేశించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, కొండలరావు, నబారి గోపి, తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం



ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల జరిగే ముప్పుపై వివరిస్తున్న లెక్చరర్ రవి

భీమునిపట్నం, జూలై 3 : ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించి, క్లాత్ బ్యాగ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని డైట్ లెక్చరర్, పర్యావరణ కార్యకర్త గొట్టేటి రవి పిలుపునిచ్చారు. బుధవారం డైట్ కళాశాలలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఏటా ఐదు ట్రిలియన్ ప్లాస్టిక్ బ్యాగులు వాడుతున్నారని, అంటే ఒక సెకండ్‌కు 1 లక్షా 60 వేల ప్లాస్టిక్ బ్యాగ్‌లు వినియోగిస్తున్నారన్నారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని, ప్రజలంతా వాటిని విడనాడాలని చెప్పారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు పట్టణంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్లు సుధాకర్, నాగేశ్వరరావు, మాధవి, త్రినాథరావు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

పద్మనాభం (రూరల్), జూలై 3 : గంధవరం పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంది. పంచాయతీలో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి ఎరువు తయారు చేసి, పంచాయతీకి సంపద సృష్టించాలని దీన్ని ఏర్పాటు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపయోగంలో ఉన్న ఈ కేంద్రం వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యాన్ని గురైంది. కేంద్రాన్ని నిరుపయోగంగా వదిలేయడంతో అది కాస్తా మందుబాబులకు, పేకాటరాయుళ్లకు అడ్డాగా మారింది. ఈవిషయమై స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా..ఎవరూ పట్టించుకోవడం లేదు.తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీ విజయవంతం

భీమునిపట్నం, జూలై 3 : పింఛన్ల పంపిణీ విజయవంతంగా నిర్వహించడం సమర్థవంతమైన నాయకత్వానికి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లు లేకపోవడంతో పింఛన్లు పంపిణీ చేయలేరని వైసీపీ నాయకులు చెప్పారని, కానీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సచివాలయం ఉద్యోగులతో ఒక్క రోజులోనే 90 శాతానికిపైగా పింఛన్ల పంపిణీ పూర్తి చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో 1న జీతాలు అందుతాయో లేదోనని ఉద్యోగుల్లో ఆందోళన ఉండేదని, కూటమి అధికారంలోకి వచ్చిన రెండు వారాలకే ఉద్యోగులకు 1న జీతాలు అందించిందన్నారు. ఒక ఆలోచనాపరుడి పాలనకు అనాలోచిత వ్యక్తి పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని కోరారు.

మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తికి నివాళులు



ఎంవీవీఎస్ మూర్తి ఘాట్ వద్ద నివాళి అర్పిస్తున్న వర్సిటీ అధికారులు

సాగర్‌నగర్, జూలై 3 : గీతం విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి 86వ జయంతి బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు.వర్సిటీ ఆవరణలోని మూర్తి విగ్రహం వద్ద, మూర్తి స్మృతి వనం వద్ద గీతం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పెద్ద ఎత్తున హాజరై నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. గంగాధరరావు మాట్లాడుతూ రాజకీయ, సామాజిక, సేవా రంగాల్లో విశేష కృషి చేసిన మూర్తి దేశ ఉన్నత విద్యా రంగంలో రాష్ట్రాన్ని గీతం విద్యా సంస్థల ద్వారా అగ్రస్థానంలో నిలిపారని కొనియాడారు. ఆయన గాంధేయ మార్గంలో నడవడం వల్ల వర్సిటీకి గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌గా (గీతం) నామకరణం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం వీసీ ప్రొఫెసర్ దయానందసిద్ధవట్టం, ప్రో వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, డాక్టర్ బి. గీతాంజలి, రిజిస్ట్రార్ డాక్టర్ గుణశేఖరన్, సలహాదారులు ప్రొఫెసర్ గొల్లు సూర్యనారాయణ, ప్రొఫెసర్ డి. హరినారాయణ, సీనియర్ ప్రొఫెసర్లు , డైరెక్టర్లు, డీన్‌లు పాల్గొన్నారు.

'కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలి'

ఆరిలోవ, జూలై 3 : కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా వ్యవహరించి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని 12వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు కోరారు. బుధవారం ఆయన 13వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాత్రకండ ధర్మారావు, కార్యదర్శి యల్లమల్లి సురేష్ ఆధ్వర్యంలో ఆరిలోవ ఆఖరి బస్టాపు సమీపంలోని క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు పార్టీల కార్యకర్తలు ఐక్యతగా ఉండి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని చెప్పారు. సమావేశంలో నాయకులు మజ్జి రమణి, బాలస్వామి, శ్రీను, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు డబ్బాలు పంపిణీ

పద్మనాభం, జూలై 3 : పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రకృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొదుపు డబ్బాలు పంపిణీ చేశారు. అల్లూరి జయంతి ఉత్సవంలో భాగంగా సభ్యులు వీటిని అందజేశారు. అలాగే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ. 516 చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు శ్రీకాంత్, అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు ఆర్ఎస్ సత్యనారాయణరాజు, కార్యదర్శి శ్రీకాంత్, మాజీ ఎంపీపీ గోపీబాబు, పాఠశాల హెచ్ఎం గిరి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పద్దరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు డబ్బాలు పంపిణీ చేస్తున్న సభ్యులు